DATE: 18-08-2022 RNI NO : TELTEL/2021/81092

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 120

పేజీలు - 08
వెల: రూ 5/-

prajamantalu.com

గురువారం 18 ఆగస్టు, 2022

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



కాళేశ్వరం ప్రాజెక్టు నిండా అవినీతే
మోటర్లు బిగించే టెక్నికల్ సామర్థ్యం లేని సంస్థకు పనులు
5లో



నాణ్యతలో ఏమాత్రం రాజీపడొద్దు
సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలి
5లో



# కమిటీ వేయండి

రాజకీయపార్టీల హామీలను అడ్డుకోలేం

ఏది ఉచితమో.. ఏది సంక్షేమమో చెప్పలేం

ఉచితాల ప్రకటన గెలిపిస్తుందని అనలేం

దీనిపై కమిటీ వేసి విస్తృతంగా చర్చించాల్సి ఉంది

విచారణను 22కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,ఆగస్ట్17: రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇవ్వకుండా అడ్డుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఉచిత హామీలు ఒక్కటే ఎన్నికల్లో గెలుపును నిర్ణయిస్తాయని చెప్పడం సరికాదని కూడా వ్యాఖ్యానించింది. పార్టీలు ఇచ్చే ఉచిత హామీల కిందకు ఏం వస్తాయి.. ఏం రావో తేల్చడం చాలా కష్టంగా మారుతోందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఉచితాల హామీలు ఇవ్వకుండా రాజకీయ పార్టీలను తాము అడ్డుకోలేమని సుప్రీంకోర్టు వెల్లడించింది. ప్రజల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యతని.. ప్రజాధనాన్ని సరైన పద్ధతిలో వెచ్చించడమే ఇక్కడ ప్రధాన అంశమని పేర్కొంది. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఓటర్లకు ఉచిత హామీలు చేయకుండా నిరోధించాలని కోరుతూ లాయర్ అశ్విని ఉపాధ్యాయ్ దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారించింది. ఉచితం అనే పదాన్నే నిర్వచించాల్సిన అవసరం ఉందని సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ స్పష్టం చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం, ఉచిత తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలను ఉచితాలుగా వర్ణించలేమని పేర్కొన్నారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీల విజయానికి ఉచిత హామీలే కారణమని చెప్పలేమన్నారు. ఉచిత వాగ్దానాలు చేసినా ఎన్నికల్లో ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు.ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వకుండా

మిగతా 2లో..

## బీజేపీ సీనియర్లకు షాక్

- పార్లమెంటరీ బోర్డునుంచి గడ్కరీ, శివరాజ్ ఔట్
- కొత్తగా యెడ్యూరప్ప, సర్బానంద్ సోనోవాల్‌కు చోటు
- తెలంగాణ నుంచి డాక్టర్ లక్ష్మణ్‌కు అవకాశం



న్యూఢిల్లీ,అగస్టు17: బిజెపిలో సీనియర్లకు మెల్లగా ఉద్వాసన సాగుతోంది. ఇప్పటికే అద్వానీ సహా అందరినీ సాగనంపగా మిలిని ఒకరిద్దరిని కూడా పంపేప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా బీజేపీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన పార్లమెంటరీ బోర్డులో కీలక మార్పులు చోటుచేసు కున్నాయి. ఆ పార్టీ అగ్రనేతలు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లకు పార్లమెంటరీ బోర్డులో ఈసారి చోటు దక్కలేదు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పకు కొత్తగా చోటు కల్పించగా, పలువురు కొత్త ముఖాలను పార్లమెంటరీ బోర్డులోకి తీసుకున్నారు. సంస్థాగత మార్పుల్లో భాగంగా పార్లమెంటరీ బోర్డులో కీలకమార్పులను బీజేపీ చేపట్టింది.

మిగతా 2లో..



# నీచరాజకీయాలు

జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలి

కులమతాల పేరుతో విడదీసే కుట్రలను నిలవరించాలి

- నీచరాజకీయాల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు
- అభివృద్ధితో సాగుతున్న తెలంగాణ విచ్ఛిన్నానికి కుట్ర
- మోసపోతే గోసపడుతామని హెచ్చరించిన సీఎం కేసీఆర్
- మేడ్చెల్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్
- తెలంగాణ అభివృద్ధి.. 24 గంటల కరెంట్ ఆదర్శమని వెల్లడి



న్యూఢిల్లీ,ఆగస్ట్17: జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పులు రావాల్సి ఉందని సిఎం కెసిఆర్ అన్నారు. అభివృద్ధి చెందిన తెలంగాణను ధ్వంసం చేసే కుట్ర జరుగుతోందని బిజెపిపై మరోమారు ఫైర్ అయ్యారు. అభివృద్ధి చెందిన తెలంగాణను ఇలాగే ముందుకు తీసుకునిపోవాల్సి ఉందన్నారు. కానీ దీన్నిచెడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి కొనసాగడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీచ రాజకీయాల కోసం ఎంతకైనా తెగించే వారు ఎప్పటికీ ఉంటారని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. అలాంటి వారి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని అంతాయిపల్లి వద్ద 30 ఎకరాల్లో 56 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో సీట్లో కలెక్టర్ ఎస్ హరీశ్‌ను కూర్చుండబెట్టి.. పుష్పగుచ్ఛం అందించి. శుభాకాంక్షలు తెలిపారు. 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.56.20 కోట్ల నిధులతో శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, కలెక్టర్ ఎస్ హరీశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి

మిగతా 2లో..

## తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ

- రాష్ట్రంలో ఇక వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- మునుగోడులో విజయం సాధించి తీరుతాం
- 21న మునుగోడులో అమిత్‌షా బహిరంగ సభ
- అదేరోజుపార్టీలో చేరనున్న రాజగోపాల్ రెడ్డి
- పీఠం కదలడంతోనే బండి సంజయ్‌పై దాడి
- బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్
- జనగామ జిల్లాలో కొనసాగిన సంగ్రామ యాత్ర
- భారీగా తరలివచ్చి స్వాగతం పలికిన ప్రజలు
- అప్పిరెడ్డిపల్లి వద్ద వేయికిలోమీటర్లు పూర్తి
- పైలాన్ ఆవిష్కరించిన బండి సంజయ్
- పలు గ్రామాల్లో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు



హైదరాబాద్,అగస్టు17: తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ కు రాజ్యాంగంపై నమ్మకం లేదన్నారు. కేసీఆర్ తన సొంత రాజ్యాంగం రచించాలని అనుకుంటున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ యాత్రపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని అన్నారు. సీఎం కేసీఆర్‌కు అధికారాన్ని కోల్పోతున్నాం అన్న భయం పట్టుకుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని... అందుకే కేసీఆర్ బీజేపీ అంటే భయపడుతున్నారని తెలిపారు. బండి సంజయ్ యాత్రపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంజయ్ ప్రజా సంగ్రామ యాత్రకు నిరాటకంగా జరిగేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి అమిత్ షా ఈ నెల 21న తెలంగాణ లో పర్యటిస్తారని తెలిపారు. అదే రోజు అమిత్ షా మునుగోడులో సాయంత్రం 4 గంటలకు భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. అదే సభలో రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఇంకా ఇతర పార్టీలకు చెందిన చాలా మంది

మిగతా 2లో..

## సోనియాకు గులాంనబీ షాక్

కాశ్మీర్ బాధ్యతలు వద్దంటూ తిరస్కరణ



న్యూఢిల్లీ,ఆగస్ట్17: కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీకి పార్టీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ షాకిచ్చారు. జమ్ముకశ్మీర్ పార్టీ ప్రచార కమిటీ సారథిగా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకోగా.. ఆ బాధ్యత స్వీకరించేందుకు నిరాకరించారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీకి కూడారాజీనామా చేశారు. తనను తక్కువ చేస్తూ తీసుకున్న నిర్ణయాలపై ఆయన అసంతృప్తితో సున్నితంగానే పదవులను దూరం పెట్టారు. కొన్నేళ్లుగా

మిగతా 2లో..

## ప్రజానాడి




## మేక్ ఇండియా నంబర్‌వన్

- మారుమూల ప్రాంతాలకు సైతం విద్య, వైద్యం
- విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయంపై ప్రధాన దృష్టి
- 75ఏళ్లలో ఎంతో సాధించినా.. ప్రజల్లో ఆగ్రహం తగ్గలేదు
- యువశక్తిని ముందుకు తీసుకుని వెళ్లాల్సి ఉంది
- అన్నిపార్టీలు తనతో కలసి రావాలన్న కేజ్రీవాల్
- ఢిల్లీలో కార్యక్రమం ప్రారంభోత్సవంలో సిఎం కేజ్రీవాల పిలుపు



న్యూఢిల్లీ,అగస్టు17: భారత దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ప్రథమ స్థానంలో నిలిపేందుకు తనతో కలిసి రావాలని అన్ని రాజకీయ పార్టీలను ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కోరారు. తనతో కలసి అడుగు వేయాలన్నారు. యావత్తు దేశ సర్వతోముఖాభివృద్ధిపై దృష్టి సారించారు. ఈ లక్ష్యం కోసం మేక్ ఇండియా నెం.1 అనే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో

మిగతా 2లో..



## కాంగ్రెస్‌ను గెలిపించుకోవడమే లక్ష్యం కావాలి

- మన మునుగోడు.. మన కాంగ్రెస్ నినాదం దద్దరిల్లాలి
- టీమ్‌వర్క్‌ను మాత్రమే కాంగ్రెస్ నమ్ముతుంది
- బీజేపీలో చేరిన వారి విమర్శలను పట్టించుకోను
- పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిగం ఠాకూర్

హైదరాబాద్,అగస్టు17: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మాణిక్కం ఠాగూర్ పిలుపునిచ్చారు. మన మునుగోడు.. మన కాంగ్రెస్ నినాదాన్ని ఇంటింటికి తీసుకెళ్లి విజయం దిశగా ముందుకుసాగాలని అన్నారు. పార్టీ శ్రేణులతో గాంధీభవన్లోఓ ఆయన సమీక్షించారు. ఈ నెల 20న మునుగోడు నియోజకవర్గంలో రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆదేశించారు. గాంధీ కుటుంబం త్యాగాల గురించి పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. 20వ తేదీన కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం కావాలని మాణిక్కం ఠాగూర్ చెప్పారు. సెప్టెంబర్ 7వ తేదీన ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర

మిగతా 5లో..

# కమిటీ వేయండి

మొదటిపేజీ తరువాయి..

అడ్డుకోలేమని తెలిపింది. ఈ ఉచిత హామీల అంశాన్ని తేల్చేందుకు ఓ కమిటీ వేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు ఎన్నికల ప్రయోజనాల కోసం ఓటర్లకు ఉచితాలను పంపిణీ చేయడానికి పార్టీలు చేస్తున్న ప్రయత్నాలను నియంత్రించాలంటూ న్యాయవాది అశ్వినీకుమార్ ఉపాధ్యాయ్ వేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ ఎన్.వి. రమణ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇవ్వకుండా మేం అడ్డుకోలేం. అయితే ఉచిత హామీలు ఒక్కటే ఎన్నికల్లో గెలుపును నిర్ణయిస్తాయని చెప్పడం సరికాదు. కొన్ని పార్టీలు అనేక వాగ్దానాలు చేసినప్పటికీ ఎన్నికల్లో గెలవలేకపోతున్నాయి. అంతేగాక, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వంటి పథకాలు పౌరులు గౌరవంగా జీవించేందుకు దోహదపడుతున్నాయనిచీఫ్ జస్టిస్ ఎన్.వి. రమణ అన్నారు. అయితే.. ఏది సరైన హామీ అనేదే ఇక్కడ ప్రశ్న. ఉచిత విద్య, వైద్యం, తాగునీరు అందించడం వంటి వాటిని ఉచితాలుగా పరిగణించాలా? కన్స్యూమర్ ఉత్పత్తులు, ఉచిత ఎలక్ట్రానిక్ వస్తువులను సంక్షేమ పథకాలుగా అభివర్ణించాలా? ప్రజాధనాన్నిఖర్చు చేయడానికి సరైన మార్గం ఏంటనేదానిపై మనం దృష్టిపెట్టాలి. ఉచితాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కొందరు అంటున్నారు. మరికొందరేమో అవన్నీ సంక్షేమ పథకాలని చెబుతున్నారు.

దీంతో ఈ అంశం సంక్లిష్టంగా మారుతోంది. అందుకే ఉచితాలపై చర్చించి సూచనలు చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. దీనిపై మీ సలహాలు ఇవ్వండని సీజేఐ జస్టిస్ ఎన్.వి. రమణ వ్యాజ్యదారులకు సూచించారు. అనంతరం ఈ కేసులో తదుపరి విచారణను 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఉచిత హామీలు ఇస్తుండడానికి వ్యతిరేకంగా న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మేనిఫెస్టోలను నియంత్రించేలా కేంద్రాన్ని, ఎన్నికల సంఘాన్ని నిర్దేశిరచాలని, ఇలాంటి ఉచిత వాగ్దానాలకు రాజకీయ పార్టీలను జవాబుదారీగా చేయాలని అశ్వినీకుమార్ కోరారు. ఈ పిటిషన్‌లో వాదనల కోసం తమను కూడా చేర్చుకోవాలంటూ ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, డీఎంకే కూడా పిటిషన్లు దాఖలు చేశాయి. దీనిపై గతంలో వాదనలు విన్న సుప్రీంకోర్టు.. ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు చేసే ఉచిత వాగ్దానాల అంశాన్ని పరిశీలిస్తామని, ఆ అంశంలో నిబంధనలు ఉల్లంఘించిన రాజకీయ పార్టీలను రద్దు చేయాలన్న విజ్ఞప్తి జోలికి మాత్రం వెళ్లబోమని స్పష్టం చేసింది.

## మద్రాస్ హైకోర్టులో పన్నీర్ సెల్వంకు ఊరట

చెన్నై,అగస్టు17: మద్రాస్ హైకోర్టులో పన్నీర్ సెల్వంకు ఊరట లభించింది. ఆయనకు అనుకూలంగా మద్రాస్ హైకోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. జూన్ 23 నాటి యధాతథ స్థితిని కొనసాగించాలని తెలిపింది. కోఆర్డినేటర్, జాయింట్ కోఆర్డినేటర్ ఇద్దరి అనుమతి లేకుండా అన్నాడీఎంకే సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించడాన్ని తప్పుపట్టింది. ఏఐఏడీఎంకే జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని తిరిగి నిర్వహించాలని న్యాయమూర్తి జి జయచంద్రన్ ఆదేశించారు. కాగా, తొలుత న్యాయమూర్తి కృష్ణన్ రామసామి ఈ కేసుపై విచారణ జరిపారు. అయితే జడ్జిని మార్చాలని ఓపీఎస్ తరుపు న్యాయవాది కోరారు. దీనిపై ఓపీఎస్‌కు కోర్టు చీవాట్లు పెట్టింది. న్యాయవ్యవస్థపై నమ్మకం లేకపోవడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఓపీఎస్ బృందం క్షమాపణ చెప్పింది. ఈ నేపథ్యంలో గత వారం న్యాయమూర్తి జి జయచంద్రన్ ఇరు పార్టీల వాదనలు విన్నారు. రిజర్వ్ చేసిన తీర్పును బుధవారం వెల్లడించారు. అన్నాడీఎంకే అధినేత్రి, మాజీ సీఎం జయలలిత మరణాంతరం పార్టీని నడిపేందుకు ఎడప్పాడి కె పళనిస్వామి కోఆర్డినేటర్‌గా, ఓ పన్నీర్ సెల్వం జాయింట్ కోఆర్డినేటర్ గా నియమితులయ్యారు. అయితే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటమి అనంతరం ఇరువురు మధ్య విభేదాలు తలెత్తాయి. పార్టీకి వ్యతిరేకంగా, డీఎంకేకు మద్దతుగా ఓపీఎస్ వ్యవహరిస్తున్నారని ఈపీఎస్ వర్గం ఆరోపించింది. ఈ నేపథ్యంలో జూలై 11న జరిగిన ఏఐఏడీఎంకే సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఈపీఎస్, ఓపీఎస్ పదవులను రద్దు చేశారు.

## బీజేపీ సీనియర్లకు షాక్

మొదటిపేజీ తరువాయి..

బిజేపీలో అత్యంత కీలకంగా భావించే పార్లమెంటరీ బోర్డు నుంచి గడ్కరిని మినహాయించడం దిగ్భ్రాంతి కలిగించే అంశం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంలోని సీనియర్ మంత్రుల్లో గడ్కరి ఒకరు. బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు కూడా. మాజీ అధ్యక్షులను పార్లమెంటరీ బోర్డులో కొనసాగించడం బీజేపీలో ఇంతవరకూ సంప్రదాయంగా కొనసాగుతోంది. కాగా, బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడైన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పార్లమెంటరీ బోర్డులో తిరిగి చోటు దక్కింది. మరో ఆశ్చర్యం



కలిగించే అంశం కూడా ఈసారి చోటు చేసుకుంది. గత ఏడాది బలవంతంగా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన 77 ఏళ్ల కర్ణాటక బీజేపీ నేత బీఎస్ యడియూరప్పకు పార్లమెంటరీ బోర్డులో చోటు కల్పించారు. ఇటీవల హిమంత్ బిశ్వా శర్మకు మార్గం సుగమం చేసిన అసోం మాజీ ముఖ్యమంత్రి సర్బానంద్ సోనోవాల్‌కు పార్లమెంటరీ బోర్డులోనూ, సెంట్రల్ ఎలక్షన్ కమిటీలోనూ చోటు దక్కింది. అలాగే, శివసేన రెబల్ ఏక్‌నాథ్ షిండేతో కలిసి మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తనను తాను తగ్గించుకునేందుకు ఇష్టపడి డిప్యూటీ సీఎం పదవిని చేపట్టిన దేవేంద్ర ఫడ్నవిస్‌కు ఎలక్షన్ కమిటీలో బీజేపీ అధిష్ఠానం చోటు కల్పించింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాతో పాటు మరో తొమ్మిది సభ్యులతో ఏర్పాటు చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా బోర్డును ప్రకటించారు. నరేంద్ర మోదీ, రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, జేపీనడ్డా, బీఎస్ యడ్యూరప్ప, సర్బానంద సోనోవాల్, కే లక్ష్మణ్, ఇక్బాల్ సింగ్ లాల్పురా, సుధా యాదవ్, సత్యనారాయణ జాతియా, బీఎల్ సంతోష్‌ను సభ్యులుగా నియమించింది. ఇదిలా ఉండగా.. పార్లమెంటరీ బోర్డు నుంచి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్‌కు ఉద్వాసన పలుకగా.. బీఎస్ యడ్యూరప్ప, బీఎల్ సంతోష్‌లకు బీజేపీ పార్లమెంట్ బోర్డులో అవకాశం కల్పించింది. అలాగే బీజేపీ 15 మంది సభ్యులతో కేంద్ర ఎన్నికల కమిటీని ప్రకటించింది. ఆ పార్టీ అధ్యక్షుడు జేడీ నడ్డా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. ఇందులో తెలంగాణ నుంచి లక్ష్మణ్‌కు చోటు దక్కడం విశేషం.

## సోనియాకు గులాంనబీ షాక్

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తి గళం వినిపిస్తున్న సీనియర్ నేతల జీ 23 గ్రూప్ లో ఆజాద్ ప్రముఖుడు. ఇప్పటికే కాంగ్రెస్ వ్యవహారాల కమిటీలో ఉన్న ఆజాద్ ను జమ్ముకశ్మీర్ కు పరిమితం చేయడం తన హోదా తగ్గించినట్టు అవుతుందని అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

మరోవైపు ఆజాద్ కు సన్నిహితుడు అహ్మద్ మీర్ జమ్ము కశ్మీర్ కాంగ్రెస్ చీఫ్ పదవి నుంచి తప్పు కోవాల్సి వచ్చింది. జమ్ము అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా.. ఎన్నికలు, ప్రచారం సహా ఇతర కమిటీలను కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ నియమించారు. జమ్ముకశ్మీర్ పీసీసీ చీఫ్ గా వికార్ వసూల్ వనీ ని, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రమణ్ భల్లాను నియమించారు. అయితే ఆజాద్ ను ప్రచార కమిటీ చీఫ్ గా నియమించగా... ఆ బాధ్యతలను తప్పుకున్నారు. గతంలో ఆజాద్ జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో అనేక కీలక పదవులను నిర్వర్తించారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా గులాం నబీ ఆజాద్ కొత్త బాధ్యతలను స్వీకరించడానికి నిరాకరించినట్లుగా ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఓటర్ల జాబితా ఖరారు, డీలిమిటేషన్ కసరత్తు పూర్తయిన తర్వాత జమ్ము కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే శీతాకాలం ముగిసేలోపు డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ పూర్తి కానందున ఈ ఏడాది ఎన్నికలు నిర్వహించలేమనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఎన్నికల సంఘం ఇటీవల ఓటర్ల జాబితా తుది ప్రచురణ తేదీని నవంబర్ 25కి సవరించింది.

## రాష్ట్రంలో అవినీతిపై అమిత్ షా దృష్టి: వివేక్

జనగామ,ఆగస్ట్17: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై నరేంద్రమోడీ, అమిత్ షా ప్రత్యేక దృష్టి సారించారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి అన్నారు. రాజగోపాల్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవడంతో పాటు బీజేపీని గెలిపించేందుకే అమిత్ షా వస్తున్నారని చెప్పారు. ఈ నెల 21న జరిగే సభను విజయవంతం చేయాలని వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఇందుకోసం భారీ ఎత్తున జన సమీకరణ చేయాలని సూచించారు. రాష్ట్రంలో కుటుంబ, నియంతృత్వ పాలన పోవాలని జనం కోరుకుంటున్నారని చెప్పారు. కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్ల కోసమే కేసీఆర్ మిషన్ భగీరథ పథకం తెచ్చారని వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. రూ. 40వేల కోట్లు ఖర్చు పెట్టినా ఆ పథకం పూర్తికాలేదని, మళ్లీ రూ.30వేల కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మిషన్ భగీరథకు నిధులివ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న ముఖ్యమంత్రి మోడీ సర్కారు ఇచ్చే ఫండ్స్‌ను డైవర్ట్ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిధుల ఖర్చుపై వైట్ పేపర్ రిలీజ్ చేయాలని వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. అవినీతిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రధాని మోడీ, అమిత్ షా సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. మునుగోడులో బీజేపీ తప్పక విజయం సాధిస్తుందని వివేక్ ధీమా వ్యక్తం చేశారు.

# నీచ రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి..

తదితరులు పాల్గొన్నారు. మనం జాగ్రత్తగా ఉంటే మన రాష్ట్రాన్ని దేశాన్ని కాపాడుకోగలమని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. అందరూ ఐక్యంగా ఉండి రాష్ట్ర ప్రగతికి దోహదపడాలని పిలుపునిచ్చారు. దేశ రాజకీయాల్లో ప్రభావం చూపేలా చైతన్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఏమాత్రం మోసపోయినా గోస పడతామని ప్రజలను సీఎం హెచ్చరించారు. మేడ్చల్‌లో కలెక్టరేట్ భవనం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. మేడ్చల్ జిల్లా అవుతుందని ఎవరూ అనుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పాటు వల్లే ఇది సాధ్యమైందన్నారు. ప్రజలకు పరిపాలన ఎంత దగ్గరకు వస్తే అంత చక్కగా పనులు జరుగుతాయని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలు ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు. మనం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటే నిరంతర విద్యుత్, సంక్షేమం వచ్చేదా అని ప్రశ్నించారు. దేశంలో జరిగే పరిణామాలపై ఎప్పటికప్పుడు చర్చలు జరగాలి. చైతన్యవంతమైన సమాజం ఉంటే ముందుకు పురోగమిస్తాం. సమాజంలో విద్వేషం పెచ్చరిల్లిందంటే మళ్లీ ఏకం కావడం కష్టం. అభివృద్ధి చెందిన దేశాల బాటలో కుల, మత రహితంగా ముందుకు సాగాలి. నీచ రాజకీయల కోసం ఎంతకైనా తెగించే ఎప్పటికీ ఉంటారు. అందుచేత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. జాగ్రత్తగా ఉంటే మన రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోగలం అన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో కరెంటు పోదని, కానీ దేశరాజధాని ఢిల్లీలో మాత్రం 24 గంటల కరెంటు రాదని సీఎం కేసీఆర్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్ ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నామని, ఈ విషయం పదే పదే చెప్పడానికి కారణం ఉందన్నారు. హైదరాబాద్‌లో కరెంటు పోదు.. అదే దేశరాజధాని ఢిల్లీలో 24 గంటల కరెంటు రాదు. దేశంలో పరిస్థితి ఇలాగే ఉంది. అందుకే ఈ విషయాన్ని పదే పదే చెప్తున్నా. ఆదిలాబాద్ గోండు గూడెంలో, వరంగల్ లంబాడీ తండాలో, హైదరాబాద్ బంజారా హిల్స్‌లో ఎక్కడైనా సరే 24 గంటలూ ఉంటుంది. ఇంతకుముందు చాలా మంది కేసీఆర్ కన్నా దొడ్డుగున్నోళ్లు, పొడుగున్నోళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు. వాళ్లెందుకు కరెంటు ఇవ్వలేదు? ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన ఉంటే మెదడు రంగరించి ఫలితాలు సాధిస్తారు. ఒకప్పుడు మంచి నీళ్ల కోసం నానా తంటాలు పడేవాళ్లు. ట్యాంకర్ల వెంటపడేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్దకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు జిల్లా నేతలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా త్రివర్ణ బెలూన్లను ఎగుర వేశారు. మేడ్చల్‌లో గ్రామీణ ప్రాంతాలు తక్కువ. దాంతో ఇక్కడ పరిశ్రమలు వస్తాయి. ఉపాధి దొరుకుతుంది. రియల్ ఎస్టేట్ పెరుగుతుంది. వీటి వల్ల చాలా పనులు చెయ్యాల్సి వస్తుంది. వీటికోసం అందరు ఎమ్మెల్యేలకు రూ.5 కోట్ల నిధులు ఇచ్చాం. ఇవి చాలడం లేదని ఎమ్మెల్యేలు చెప్పారు. అందుకే ఈ ఏడు నియోజక వర్గాల ఎమ్మెల్యేలకు మరో రూ.పది కోట్ల నిధులు మంజూరు చేస్తున్నా. రేపే దీనికి సంబంధించి జీవో విడుదల చేస్తా. ఇలా మనకు నిధులు ఉన్నాయి. కానీ కొందరు మూర్ఖులు కారుకూతలు కూస్తున్నారని అన్నారు. తెలంగాణ పేషెంట్లకు కూడా ఆసరా పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించాం.

వీళ్లకే కాదు చేనేత, గీత కార్మికులకు, బోదకాలు బాధితులకు ఇలా ఎంతోమందికి ఇస్తున్నం. చాలామంది తెలంగాణ పల్లెల్లో ఏమమ్మా ఎలా ఉన్నావ్? అనడిగితే.. హైదరాబాద్‌లో నా పెద్దకొడుకు కేసీఆర్ ఉన్నాడు. డబ్బులు పంపిస్తాడని చెప్తున్నారు. అందుకే చాలా మంది కోడళ్లు అత్తమామల్ని ఇంటికి




ధనిక రాష్ట్రమని నేను ఎప్పుడో చెప్పా. ఎందుకంటే మనకున్న వనరులు అలాంటివి. ఒక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కొలిచే విధానంలో రెండు ముఖ్యమైన విషయా లుంటాయి. వాటిలో ఒకటి తలసరి ఆదాయం. ఒకప్పుడు ఇది కేవలం రూ.లక్షగా ఉండేది. ఇప్పుడు ఇండియాలో నెంబర్‌వన్‌గా రూ.2,78,500కు పెరిగింది. మనకన్నా ముందే రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్‌లను మనం దాటేశాం. ఇది వట్టిగానే జరుగుతుందా? అవినీతి రహితంగా అనుకున్నది అనుకున్నట్లు చేస్తేనే ఇది సాధ్యం అవుతుంది. తెలంగాణ ఇంత అభివృద్ధి చెందడం చూసి దేశమంతా ఆశ్చర్యపోతుంది. తెలంగాణ రాష్ట్రం అయితే ప్రభుత్వ ఉద్యోగులకు దేశంలోనే ఉత్తమమైన జీతాలు దొరుకుతాయని చెప్పా. ఇప్పుడు మన ప్రభుత్యోద్యోగులే దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్నారు. పేద పిల్లల పెళ్లిళ్లు జరిగితే ఏ రాష్ట్రంలోనైనా రూ.లక్ష ఇస్తున్నారా? ఇప్పటికే పదకొండు లక్షల కుటుంబాలకు రూ.9వేల కోట్లపైగా ఖర్చు చేశాం. దేశంలో మరెక్కడా ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు పెన్షన్లు ఇవ్వరు. వికలాంగ సోదరులకు రూ.3016 ఇచ్చే రాష్ట్రం కూడా తెలంగాణ ఒక్కటే. ఈ మధ్యనే డయాలసిస్ తెచ్చి పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముసలాళ్లే మోతుబరిగా ఉన్నారు. నేను పంపే డబ్బులో కూడా ఎంతో కొంత దాచుకుంటున్నారు. బియ్యానికి కూడా గతంలో ఇంట్లో ముగ్గురు, నలుగురికే ఇస్తామనే వారు. ఇప్పుడు ఎంత మంది ఉంటే అంతమందికి నాలుగు కాకుండా ఆరు కిలోలు ఇస్తున్నాం అని వివరించారు.

మన వనరులు మనకే దక్కడంతో ఆర్థికంగా మనం పెరిగినట్టు కెసిఆర్ వెల్లడించారు. జీఎస్‌డీపీ అంటే రాష్ట్ర స్థూలఉత్పత్తి. ఇది కూడా ఒక గీటురాయి. ఇది 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.5 లక్షలకోట్లు ఉండేది. ఇయ్యాల అది అద్భుతంగా పెరిగి రూ.11.5 లక్షలకోట్లకు చేరింది. అధికారులు అంకితభావం, ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి, ప్రభుత్వం లక్ష్యశుద్ధి వల్లే ఇది సాధ్యమైంది. చాలా రాష్ట్రాల్లో ఇప్పుడు మనం ప్రారంభించుకున్న కలెక్టరేట్ వంటి భవనాలు కూడా లేవు. మొత్తం 33 జిల్లాల్లో వీటితోపాటు పోలీసు భవనాలు కూడా తీసుకొస్తున్నామన్నారు. దేశంలోనే అత్యధిక గురుకులాలు ఉన్న రాష్ట్రం కూడా మనదే. వీటిలో చదువుకుంటున్న పేద విద్యార్థులు దేశం ఆశ్చర్యపోయే ఫలితాలు సాధిస్తున్నారు.. కరోనా రాకుంటే మరిన్ని గురుకులాలు పెంచేవాళ్లం. ఈ మధ్య బీసీల కోసం కొన్ని పెంచినా.. మరిన్ని పెంచాల్సిన అవసరం ఉంది. మిషన్ భగీరథ ద్వారా మంచి నీళ్ల కొరత కూడా తీర్చుకున్నాం. ఒకప్పుడు మన రాష్ట్రం నుంచి కూలీల కోసం పోయేవారు. ఇప్పుడు పన్నెండు రాష్ట్రాల నుంచి ఇక్కడకు బతుకుతెరువు కోసం వస్తున్నారు. వాళ్లందరికీ పని కల్పించే అద్భుతమైన రాష్ట్రంగా మనం ఎదిగాం. ఉద్యమకాలంలో ఏది కావాలని కోరుకున్నామో అది సాధించుకున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు. పరిపాలన వికేంద్రీకరణతో ప్రజలకు వేగంగా సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎవరూ మేడ్చల్ జిల్లా అవుతుందని ఏనాడూ కల కూడా కనలేదన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం వల్ల కలిగిన శుభపరిణామం. పరిపాలన ప్రజలకు ఎంత దగ్గరకు వస్తే అంత చక్కగా పనులు జరిగే అవకాశం ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న సమయంలో జిల్లా చేసే సందర్భంగా పెద్దగా చెర్చ జరిగింది. మూడు జిల్లాలు అవుతాయని చెప్పారు. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కావొచ్చు.. అలా చేస్తే భవిష్యత్‌లో బాగుంటుందని పెద్దలు చెప్పడం, ప్రజాప్రతినిధులు, మంత్రులు కోరడం.. జనాభాను పరిశీలించినప్పుడు చాలా పెద్ద జిల్లాగా ఉండడం, పరిపాలన సౌలభ్యం గొప్పగా ఉండాలంటే, ప్రజలకు అన్నీ మంచి పనులు నెరవేరాలంటే తప్పకుండా మేడ్చల్ జిల్లా కావాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగానే 33 జిల్లాలు వచ్చినయ్. రైతులు వేదికలు ఏర్పాటు చేయాలంటే మన రాష్ట్రంలో మన వ్యవసాయ భూమిని ప్రతి 5వేల ఎకరాలకు క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, ఒక్కో వ్యవసాయాధికారిని నియమించాం. 2601 క్లస్టర్లు అయ్యాయి. వాటన్నింటికి కూడా పేరుకే రైతులు కానీ.. కూర్చుకునేందుకు వేదిక లేదని చెప్పి.. ఆరేడు నెలల్లో నిర్మించాం. పరిపాలన వికేంద్రీకరణ జరిగిందింది కాబట్టి.. అంత సులభంగా భవనాలు కట్టుకోగలిగాం. రాష్ట్రంలో ఇప్పటికే 11వేల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుకాబోతున్నాయి. రాష్ట్రంలో తీసుకున్న కార్యక్రమాల ప్రజలకు చకాచకా ప్రజలకు వేగంగా అందుతున్నయ్. ఇవాళ మనం ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలు.. దివ్యాంగులు, మహిళలు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్లు అద్భుతంగా ఈ రోజు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా దళారీల ప్రమేయం లేకుండా కార్యాలయాల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా ఠంచన్‌గా వారందరికీ అందుతున్నయన్నారు. రాష్ట్రంలో 36లక్షల పెన్షన్లు ఉన్నయ్. మరో 10లక్షల పెన్షన్లు ఆగస్టు 15 నుంచి పంచుతున్నం. కరోనాతో కొంత ఆలస్యమైంది. 57 సంవత్సరాల వారికి ఇస్తామని చెప్పాం. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తికమక అయిన పరిస్థితుల్లో కొంత ఆలస్యమైంది. ఇచ్చినమాటను నిలబెట్టుకుంటే 46లక్షలకు పెన్షన్లు చేరుకుంటున్నయ్. ఈ 46లక్షల పెన్షన్‌దారులకు అద్భుతమైన కొత్త కార్డులు ఎలక్ట్రానిక్ బార్‌కోడ్లతో పంపిణీ చేస్తున్నారు. రాబోయే వారం పదిరోజుల్లో ఎమ్మెల్యేలు పంపిణీ చేస్తారని, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని' సీఎం కేసీఆర్ కోరారు.

## మేక్ ఇండియా నంబర్‌వన్

మొదటిపేజీ తరువాయి..




కేజీవ్రాల్ మాట్లాడుతూ, దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ పాఠశాలలను నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలకు పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయంపై ప్రధాన దృష్టితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు తనతో కలిసి రావాలన్నారు. మేక్ ఇండియా నెంబర్ వన్ మిషన్ ద్వారా దేశంలోని 130 కోట్ల మంది భారతీయులను అనుసంధానం చేస్తామన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు అయిందని, ఈ సమయంలో ఎంతో సాధించామని, అయినా ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. ఈ కాలంలో చాలా చిన్న దేశాలు మన కన్నా ముందుకు దూసుకెళ్ళాయనే భావన ఉందని చెప్పారు. 7 కోట్ల మంది బాలలకు మంచి, ఉచిత విద్యను అందజేయాలన్నారు. పర్వతాలు, గిరిజన ప్రాంతాల్లో పాఠశాలలను ఏర్పాటు చేయలేమని మనం చెప్పకూడదన్నారు. ఎంత ఖర్చు అయినప్పటికీ, ఈ పనిని చేయాలన్నారు. ఓ బాలుడు లేదా బాలిక తన కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేసి, ధనిక కుటుంబంగా మార్చగలరన్నారు. అలాంటపుడు సంపన్న దేశాల జాబితాలో భారత దేశం చేరుతుందని చెప్పారు.

మనం దృష్టి సారించవలసిన రెండో అంశం, ప్రజలకు మెరుగైన, ఉచిత వైద్య చికిత్సను అందజేయడమని చెప్పారు. మనం కృషి చేయవలసిన మూడో అంశం యువశక్తి అని తెలిపారు. యువశక్తి మనకుగల అద్భుతమైన బలమని చెప్పారు. నేడు యువత నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని, యువతకు ఉపాధి కల్పించాలని అన్నారు.అందుకే దేశం నలుమూలలా స్కూళ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కేజీవ్రాల్ పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ సహా ఇతర రాజకీయ పార్టీలన్నీ తాను చేపట్టిన మిషన్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తన మిషన్ ప్రధానంగా విద్య, వైద్య, సేద్య రంగాలపై దృష్టిసారిస్తుందని చెప్పారు. ఈ మిషన్ ద్వారా 130 కోట్ల భారతీయులను ఏకతాటిపైకి తీసుకువస్తానని తెలిపారు. మనం 75 ఏండ్ల స్వాతంత్య్ర ఫలాలను అనుభవిస్తున్నాం..మనం ఎంతో సాధించినా ప్రజలు ఇంకా కడగండ్లకు లోనవుతూ పాలకులపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే ఎన్నో చిన్న దేశాలు అభివృద్ధిలో మనకంటే వేగంగా పరుగులు పెట్టాయని గుర్తుచేశారు. మనం దేశవ్యాప్తంగా 27 కోట్ల మంది చిన్నారులకు మెరుగైన, ఉచిత విద్యను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కుటుంబానికి చెందిన ఓ చిన్నారి వారి కుటుంబాన్ని పేదరికం నుంచి సంపన్నులుగా మార్చ గలడని, ఇది విద్యతోనే సాధ్యమని కేజీవ్రాల్ స్పష్టం చేశారు. దీనికోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడరాదని పిలుపు ఇచ్చారు. అప్పుడే భారత్ పేరు సంపన్న దేశాల జాబితాలోకి చేరుతుందని పేర్కొన్నారు. ఇక మెరుగైన, ఉచిత వైద్యం అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా చూడటం అత్యవసరమని స్పష్టం చేశారు. విశ్లేషకుల కథనం ప్రకారం, గుజరాత్ శాసన సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అరవింద్ కేజీవ్రాల్ కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఢిల్లీలో పాగా వేసిన ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌ను కూడా కైవసం చేసుకోవడంతో ఆ పార్టీలో గొప్ప ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఇక గుజరాత్‌ను సొంతం చేసుకోవడమే లక్ష్యంగా కేజీవ్రాల్ పావులు కదుపుతున్నారు.

## వ్యవసాయ రుణాలపై 1.5 శాతం వడ్డీ రాయితీ

### వ్యవసాయ రంగానికి పెరగనున్న రుణ లభ్యత

### కేంద్రంపై పాడనున్న రూ.34,856 కోట్ల భారం

దిల్లీ: స్వల్పకాలిక వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీ పునరుద్ధరించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. రూ.3 లక్షల వరకు ఉన్న రుణాలపై 1.5 శాతం చొప్పున రాయితీ ఇవ్వనున్నారు. ఈ రాయితీ మొత్తాన్ని రుణాలు జారీ చేసే ఆర్థిక సంస్థలకు కేంద్రం చెల్లిస్తుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. కేబినెట్ తీసుకున్న వడ్డీ రాయితీ నిర్ణయం వల్ల వ్యవసాయ రంగానికి రుణ లభ్యత పెరుగుతుందని కేంద్రం పేర్కొంది. 2022-23 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాలకు గానూ ఈ స్కీమ్ వర్తిస్తుందని తెలిపింది. దీనివల్ల రూ.34,856 కోట్లు కేంద్రంపై భారం పడుతుందని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు, స్మాల్‌ఫైనాన్స్, రీజినల్ రూరల్ బ్యాంకులు, కో-ఆపరేటివ్, ప్రాథమిక పరపతి సంఘాలకు ఈ వడ్డీ రాయితీ వర్తిస్తుందని కేంద్రం వెల్లడించింది. రైతులు తీసుకొనే స్వల్పకాలిక రుణాలకు ఎప్పటిలానే 4 శాతం వడ్డీ వర్తిస్తుంది. కొవిడ్ కారణంగా దెబ్బతిన్న ఆతిథ్య రంగానికి ఊతమిచ్చేందుకు కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. హాస్పిటాలిటీ, అనుబంధ రంగాల్లో సేవలందిస్తున్న సంస్థలకు ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ )ను ప్రకటించింది.



ప్రస్తుతం ఈ స్కీమ్ కింద అందిస్తున్న రూ.4.5 లక్షల కోట్లకు మరో రూ.50వేల కోట్లు అదనంగా కేటాయించింది. ఈ మొత్తాన్ని హాస్పిటాలిటీ రంగానికి ప్రత్యేకించింది. ఇప్పటి వరకు అత్యవసర రుణ పథకం కింద రూ.3.67 లక్షల కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. కొవిడ్ సమయంలో దెబ్బతిన్న రంగాలకు ఊతమిచ్చేందుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే.

## స్కూల్ పై కప్పు మరియు ప్రహరి గోడ కూలిపోవడంతో నిర్మించి ఇస్తామని నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ హామీ.

**కరీంనగర్ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** కరీంనగర్ లోని గవర్నమెంట్ గర్ల్స్ హై





స్కూల్ లో (ఉర్దు మీడియం) పై కప్పు మరియు ప్రహరీ గోడ కూలిపోయింది సిబ్బంది మరియు విద్యార్థులు అక్కడ పడుతున్న ఇబ్బందులు నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. వారు వెంటనే స్పందించి స్కూల్ వెళ్ళి పడిపోయిన పై కప్పు మరియు గోడ ను పరిశీలించి తాను బాగు చేపిస్తనని హామీ ఇవ్వడం జరిగింది అదేవిధంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలతో మాట్లాడి వారికి ఉన్న ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు స్కూల్ లో వసతులు విషయంలో మేము చూసుకుంటాం మీరు మాత్రం విద్యార్థులు ఏది ఏమైనప్పటికీ చదువు మీదనే దృష్టి పెట్టాలని చక్కగా చదువుకోని స్కూల్ పేరును కరీంనగర్ పేరు నిలబెట్టాలని విద్యార్థులతో నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ గారు వారి పెంట మాజీ కార్పోరేటర్ సాదవేణి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## రక్త దాన శిబిరం విజయవంతం చేయాలి

**భీమదేవరపల్లి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** స్వాతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఆగస్ట్ 19 న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఓ లంకపల్లి




భాస్కర్, భీమదేవరపల్లి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పెద్దబోయిన హరికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%ొా%. రక్తదానం చేసే ప్రతి ఒక్కరికీ కొత్త రక్తకణాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. మీరు ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు రక్తాన్ని ఇవ్వచ్చని తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ఎంపిడిఓ సమావేశ మందిరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిదులు, ప్రజా సంఘాలు, కళాశాల, పాఠశాలల అధ్యాపక బృందం, మండల ప్రజలు అధిక సంఖ్యలో రక్త దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కలెక్టర్‌చే 'కళాశ్రీ రాజు' కు సన్మానం

**జగిత్యాల ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** జగిత్యాల జిలా స్థానిక దేవిశ్రీ గార్డెన్ లో



ప్రభుత్వపరంగా నిర్వహించిన 75 వసంతాల స్వతంత్ర దినోత్సవ జిల్లాస్థాయి కవి సమ్మేళనంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు స్వీయ కవిత 75 వసంతాల స్వతంత సంబరం ముచ్చట వినిపించనందులకు జిల్లా కలెక్టర్ జి. రవి గుండేటి రాజు ను శాలువా, సర్టిఫికేట్ తో ఘనముగా సన్మానించారు. ఈ సందర్భంగా జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, ప్రముఖ సాహితీ వేత్త వెలగలేటి మోహనాచార్య, కవయిత్రులు మద్దెల సరోజన, అయిత అనిత, కటుకం కవిత, నీరజ చంద్రన్, నందిమల్ల మాధవి, పోపూరి మాధవి లత, స్వయం ప్రభ సాహిత్యాభినందనలు వెలిబుచ్చారు.



**భీమదేవరపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఏడుగురికి 2.64 లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనితా రమేష్ యాదవ్, మర్పాటి మహేందర్ రెడ్డి, శరీఫోద్దిన్, యామ రాము, ఆంజనేయులు, సృజన్ తదితరులు పాల్గొన్నారు.**

## రాష్ట్రంలో కుల వృత్తులకు అధిక ప్రాధాన్యం

- మట్టి పాత్రలు వాడకం ద్వారానే ప్లాస్టిక్ నివారణ సాధ్యం
- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల ఆగస్ట్ 17 (ప్రజామంటలు): మట్టి పాత్రలు వాడకం ద్వారానే ప్లాస్టిక్ నివారణ సాధ్యం అన్నారు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. జగిత్యాల పట్టణంలో 10వ వార్డ్ లింగం పెట్ లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జగిత్యాల జిల్లా వారి అధ్వర్యంలో కుమ్మరి శాలివాహన కుల వృత్తిదారుల మాస్టర్ ట్రైనర్ లకు ఆధునిక యాంత్రిక మిషన్ లను కుమ్మరి సంఘంలో పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఎమ్మెల్యే మాట్లాడుతూ శాలివాహన కుల వృత్తులు వారికి ప్రభుత్వం ద్వారా మంజూరైన సబ్సిడీ 7 యూనిట్లు అందజేయటం ఆనందంగా ఉందని అన్నారు. దేశ సంస్కృతి సాంప్రదాయాలకు కుల వృత్తులు ప్రతీక అని అన్నారు. ప్లాస్టిక్ నివారించి మట్టి పాత్రలు వాడకం చాలా అవశ్యకం అని అన్నారు..లింగం పెట్ తనకు చాలా సంవత్సరాలుగా సుపరిచితం అని అన్నారు .మిషన్ ల ద్వారా ట్రైనింగ్ లో నేర్చుకున్న మాస్టర్ లు ఇతర సభ్యులకు నేర్పించాలని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కుల వృత్తులు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని గంగ పుత్రులకు చేపలు, యంత్రాలు, నాయి బ్రాహ్మణ 100 యూనిట్ల ఉచిత కరెంట్, యాదవులకు గొర్ల పంపిణీ, రజకులకు, విశ్వ బ్రాహ్మణ, నేతన్నలు, ఇలా అనేక కుల వృత్తులకు ప్రాధాన్యం ఇస్తూ వారి ఆర్థిక సామాజిక అభివృద్ధి కి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని అన్నారు. రైతు బందు, రైతు భీమా, బీడి కార్మికులకు పెన్షన్, ఆసరా పెన్షన్ సంక్షేమ పరంగా దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది అని అన్నారు. యాంత్రీకరణ చేపట్టిన ప్రతి దేశం అభివృద్ధి సాధించింది అని, యాంత్రీకరణ వల్ల శారీరక ఇబ్బందులు ఉండవని,ఉత్పత్తి సైతం పెరగడానికి సహాయపడుతుంది. ఆదాయం సమకూరుతుంది అని అన్నారు, గతంలో ప్రభుత్వాలు కుల వృత్తులు అభివృద్ధికి ఎటువంటి సహకారం అందించలేదని



గుర్తుచేశారు. లింగం పేట్ నుండి ప్లాస్టిక్ నివారణ ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. తయారైన మట్టి కుండలు మార్కెటింగ్ విషయం పై స్టల విషయం జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతానని విక్రయ షెడ్డు కి ఎమ్మెల్యే నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మట్టికుండల తయారీ ప్రక్రియను పరిశీలించిన డా. ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సాయి బాబా, కౌన్సిలర్ సిరికొండ భారతి రాజయ్య, ఎఎంసీ ఛైర్మెన్ నక్కల రాధ రవీందర్ రెడ్డి, శాలివాహన జిల్లా అధ్యక్షులు కృష్ణ, మండల అధ్యక్షులు రాజన్న, లింగం పెట్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, మహిపాల్, చంద్రయ్య, నరేష్, చిరంజీవి, లక్ష్మణ్, రమేష్, మహేష్, శంకర్, లచ్చన్న, నర్సయ్య, రాజేందర్, జిలానీ, ఎఫ్సిఎస్ఐ డైరెక్టర్ అరుముల్ల పవన్, మాజీ ఎఎంసీ డైరెక్టర్ బండారి విజయ్, చందా పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

## మత పిచ్చిలో మునిగిపోతున్న బీజేపీ ఎంపీ బండి సంజయ్

- కావాలనే విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు
- ముస్లిం మైనార్టీ నాయకులు మహ్మద్ ఖుతుబొద్దిన్ పాషా

**మెట్ పల్లి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ మత పిచ్చిలో మునిగిపోతున్నారని, మతిభ్రమించి ముస్లిం మైనార్టీలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, హిందూ ముస్లింలు కలిసిమెలిసి ఉండే సమాజంలో కావాలనే విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారని ముస్లిం మైనార్టీ నాయకులు మహ్మద్ ఖుతుబొద్దిన్ పాషా అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎంపీ బండి సంజయ్ కుమార్ ముస్లిం మైనార్టీలను కించ పరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం పట్ల ఖండించారు. స్వాతంత్ర పోరాటంలో ఎంతో మంది ముస్లిం పెద్దలు భారత దేశానికి స్వాతంత్రాన్ని అందించడానికి తమ ప్రాణాలనే బలి ఇచ్చారని గుర్తు చేశారు. అలాంటి మహానీయుల చరిత్ర తెలుసుకోకుండా ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. 1780 లోనే ఉత్తరాదిలో కంటే మొదలుగానే దక్షిణాదిలో స్వాతంత్ర పోరాటం మొదలైందని గుర్తు చేశారు. 1780 లో విశాఖపట్టణంలో ఈస్ట్ ఇండియా కంపెనీలో సుబేదార్ గా పనిచేసే షేక్ అహ్మద్ అను పోరాటయోధుడు బ్రిటిషర్లపై తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో ఉరి కంభాన్ని సైతం లెక్క చేయకుండా తన ప్రాణాలను అర్పించారు అని అన్నారు. అదేవిధంగా 1806 లో అదే ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా గళమెత్తిన లూరుల్ ఉమ్రా బహదూర్ తిరుగుబాటు చేశారని, ఇందుకు ఆయనను నైజాం నుంచి బహిష్కరించారని గుర్తుచేశారు. ఆ తర్వాత నైజాం నవాబు నసీర్ దౌల సోదరుడు ముబారిజ్ దౌల ఆంగ్లేయుల పెత్తనం వ్యతిరేకించి నవాబుతో కలిసి పోరాటం చేశారని, ఇందుకు జైలు శిక్ష అనుభవించి 1854లో వీరమరణం పొందారని అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కర్నూలు నవాబు, మౌల్వి అల్లావుద్దీన్ పటాన్, తురాయి బాజ్ ఖాన్ లు బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి చేసి తమ దేశ భక్తిని చాటి చెపుకున్నారని అన్నారు. 1857లో జరిగిన



స్వాతంత్ర సమర పోరాటంలో ఎంతో మంది జనాలు, జవాన్లు భాగస్వాములై అమరులయ్యారని గుర్తు చేశారు. అదే విధంగా 1922లో స్వాతంత్ర సమర యోధుడు అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో డివిజన్ మేజిస్ట్రేట్ గా పనిచేస్తున్న ఉజా జల్లాఖాన్ పోరాటం చేసి ఆకస్మిక మరణం పొందారని అన్నారు. ఇలాంటి సంఘటనలను తెలుసుకోకుండానే బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ఇష్టం వచ్చినట్లు ముస్లింలను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. ఆదినుంచి ముస్లిం మైనారిటీలపై విషం చిమ్ముతూనే ఉన్నారని, ఈ పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ముస్లిం మైనార్టీలను కించపరిచే విధంగా మరోమారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే బండి సంజయ్ కి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్ కరీం, మహమ్మద్ షఫీ, మహమ్మద్ షాహిద్, మహమ్మద్ ఇర్షాద్ తదిరితులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పెన్షన్లు వర్తింప చేయాలి

**డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్**

**ధర్మపురి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** అర్హులైన పేదలందరికీ ఆసరా పెన్షన్లు విధిగా వర్తింప చేయాలని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ధర్మపురి క్షేత్రములో మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు పెన్షన్లు ఇవ్వడానికి జిల్లా కలెక్టర్ తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ముందు తన నియోజకవర్గ లో ఉన్న అర్హులైన పేదలందరి జాబితా ను తయారు చేయాలని సూచించారు. తద్వారా నియోజకవర్గ ప్రజలకు వంద శాతం పెన్షన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి మీద ఒత్తిడి తీసుకు రావాలని సూచించారు. జాబితా విడుదల చేసేటప్పుడు పేదవారా, కాదా వంటి విషయాలు గ్రామసభ పెట్టి నిర్ణయం తీసుకోవాలన్నారు. ధర్మపురి లో మున్సిపాలిటీ చైర్ పర్సన్ కు పెన్షన్ మంజూరు అయినట్లు జాబితాలో ఉందని, మున్సిపాలిటీ నుండి జాబితా పంపించేటప్పుడు ఇక్కడి కమిషనర్ జిల్లా కలెక్టర్ కు విషయం తెలియదా అని ప్రశ్నించారు. ధర్మపురి 100 శాతం మంది పెన్షన్లు కోసం అప్లికేషన్ పెట్టుకుంటే మంజూరు అయినవి కేవలము20 శాతం మాత్రమే అన్నారు. అధికారులకు ఎందుకు ఇంత నిర్లక్ష్యం ఎందుకన్నారు. ధర్మపురి లో 300 మంది కుటుంబాల్లో ఇళ్లలోకి వరద వచ్చి నష్టపోతే సుమారు 100 మందికి మాత్రమే డబ్బులు ఇవ్వడం జరిగిందన్నారు. నష్టపోయిన కుటుంబాల కు 10వేలు ఇవ్వమనంటే ఇక్కడి టీఆర్ఎస్ నాయకులు నామమాత్రంగా 5200 పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు.



మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దినేశ్, నాయకులు కస్తూరి శ్రీనివాస్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, సత్యనారాయణ, సుముఖ్ తదితరులు పాల్గొన్నారు.

## రైళ్లలో జర్నలిస్టులకు వందశాతం రాయితి కల్పించండి

**ఎంపీ అర్వింద్‌ను కోరిన జగిత్యాల జర్నలిస్టులు**

**జగిత్యాల ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** రైళ్లలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు ప్రయాణించే సమయంలో వందశాతం రాయితీ కల్పించాలని ఎంపీ అర్వింద్ ను టియుడబ్లుజే (ఐజేయు) జర్నలిస్టులు కోరారు. బుధవారం విఆర్ఏ లకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ఎంపీ అర్వింద్ ను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీటి శ్రీనివాసరావు, ప్రదీప్ తో కూడిన జర్నలిస్టుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో రైళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణించే అక్రిడేటేడ్ జర్నలిస్టులకు యాభై శాతంతో రైళ్లలో ప్రయాణించే సౌకర్యం ఉండదన్నారు. కరోన నేపథ్యంలో రైళ్లు రద్దు కావడంతో ఈ సదుపాయాన్ని రైల్వేశాఖ రద్దు చేసిందని ఇటీవలె తిరిగి పునరుద్ధరించిందన్నారు. అయితే జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని రైళ్లలో జర్నలిస్టులకు వంద శాతం రాయితీ సౌకర్యం కల్పించేలా



కేంద్ర ప్రభుతం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ అర్వింద్ ను జర్నలిస్టులు కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు ఉన్నారు.

## జనగామ ఇండస్ట్రియల్ ఏరియాలో దారుణ హత్య

**జనగామ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రం లోని



హనుమకొండ రోడ్డు ఇండస్ట్రియల్ ఏరియా గురుద్వార్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. అంబేద్కర్ నగర్ కు చెందిన పగడాల సందీప్ అనే వ్యక్తి ఫకీర్ సురేష్ ను కత్తితో మెడ కోసి హత్య చేశాడు. సందీప్, సురేష్, మరో వ్యక్తి ముగ్గురు కలిసి హత్య జరిగిన సంఘటనకు పది మీటర్ల దూరంలో మద్యం సేవించారు. కుటుంబ తగాదాల నేపథ్యంలో సందీప్ సురేష్ ను హత్య చేసినట్లు తెలుస్తుంది. మద్యం సేవించిన ముగ్గురిలో ఒకరు పోలీస్ స్టేషన్ కు వెళ్లి హత్యకు సంబంధించిన సమాచారం అందించారు. వెంటనే సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన సందీప్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తుంది. హత్యకు కుటుంబ తగాదాలు, ఇంకేమైనా విషయం ఉండవచ్చని సీఐ అంటున్నారు.



**స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో భాగంగా జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రక్త దాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత సురేష్, కలెక్టర్ జి. రవి, గ్రంధాలయ సంస్థ ఛైర్మెన్ డా చంద్రశేఖర్ గౌడ్. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మాధురి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్, డిఎంహెచ్ఓ పుప్పాల శ్రీధర్, కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షులు పంబాల రాము, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.**



**జగిత్యాల పట్టణ ధరూర్ క్యాంపు లోని (కేజిబివి) కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయము ను సందర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. కస్తూర్బా విద్యాలయంలో వసతి సౌకర్యాలపై ఆరా తీయగా విద్యార్థులు, అధ్యాపకులు సంతృప్తి వ్యక్తం చేశారు. కస్తూర్బా అదనపు తరగతి గదుల పనులపై సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ తో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వెంట కౌన్సిలర్ జంబర్తి రాజ్ కుమార్, వైశ్య సంఘం అధ్యక్షులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.**

## మూడు మండలాల వీఆర్ఏలు ధర్నా

**మెట్ పల్లి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** మెట్ పల్లి లో రాష్ట్ర వ్యాప్త వీఆర్ఏ ఐక్యవేదిక పిలుపు మేరకు మెట్ పల్లి రెవెన్యూ డివిజన్ లోని మూడు మండలాలు మెట్ పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం వీఆర్ఏ




సమ్మె సందర్భంగా మూడు మండలాల వీఆర్ఏలు ధర్నా వద్ద నుండి ఏకలవ్య విగ్రహం వరకు అక్కడినుండి ధర్నా వద్ద వరకు ర్యాలీ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.... పే స్కేల్, అర్హత ఉన్నవారికి ప్రమోషన్ తో పాటు 55 సంవత్సరాలు పై బడిన వారి కుటుంబాలకు వారస్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి డివిజన్ జేఏసీ చైర్మన్ గోరుమంతుల సుధాకర్, కె. వినోద్, ఎస్.కె. రఫీ, వినోదు, సతీష్, నవీను, ప్రవీను, బొరిగం గంగాధర్, సతీష్, ప్రశాంత్, నరేష్, వినోద్, నితీష్, నరేష్, భూమేశ్వర్, పాల్గొన్నారు.

# నినాదాలతో దేశాన్ని పరుగెత్తించలేం!

ధరల పెరుగుదల, రూపాయి పతనం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం ఇప్పుడు దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థ దెబ్బతింటోందన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక కావాలి. ప్రధాని మోడీ ఈ విషయాలపై ఎక్కడా మాట్లాడడం లేదు. ఎర్రకోట ప్రసంగంలోనూ వీటి గురించి ప్రస్తావించలేదు. వీటిని ఎలా అధిగమించబోతున్నారో కూడా చెప్పలేదు. గతంలో చెప్పిన వాగ్దానాలేవీ అమలుకాలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన చివరి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భం గా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రస్తావించిన అంశాలు ఏవీ అమలుకాలేదు. ఇప్పుడు కొత్తగా మరో 25 ఏళ్ల దార్శనికత గురించి చెబితే ప్రజలు నమ్ముతారా అన్నది ఆలోచించడం లేదు. తన ప్రభుత్వం సాధించిన విజయాలను,చేపట్టిన సంక్షేమ పథకాలను, సంస్కరణలను ఎంతగొప్పగా చెప్పినా పొయ్యిలో పిల్లి లేవని కుటుంబాలు కోకొల్లలు. ఇన్ని చెప్పిన ప్రధాని మోడీ మన రూపాయికి శస్త్రచికిత్స చేసే విషయాన్ని మరచిపోయారు. రూపాయి రోజురోజుకూ చిక్కి శల్యమవుతున్నా ప్రస్తావించడంలేదు. రూపాయి విలువ పెరగలేదు సరికదా మరింత దిగజారుతున్నా పట్టుకుని నిలపాలన్న తపన కానరావడం లేదు. కనీసం దానిని తాను అధికారం చేపట్టిన నాటి స్థాయికి తీసుకుని వద్దామన్న ప్రయత్నం కూడా జరగడం లేదు. ఈ మాంద్యాన్ని గమనించి అడుగులు వేద్దామన్న చిత్తశుద్ధి కానరావడం లేదు.అందుకే మోడీ ఎర్రకోట ప్రసంగంపై ఎక్కడా ఆసక్తి గానీ, ఆయన పిలుపుపై స్పందన గానీ కానరావడం లేదు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు, విదేశాల నుంచి నల్లధనాన్ని వెనక్కి రప్పించడం జరగలేదు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగంపైనా ప్రధాని పెదవి విప్పలేదు. ఇలా సమస్యలు వెన్నాడు తున్నా.. ప్రజలను పట్టించుకోకుండా రానున్న పాతికేళ్ల కాలం 'అమృతకాలం' అని చెప్పడం ద్వారా మరో మారు వంచించడం తప్ప మరోటి కాదు. వంచనలతో పాలన చేయలేమని మోడీతో పాటు,రాష్ట్రాల సిఎంలు కూడా గుర్తించాలి. నిరుద్యోగం,ద్రవ్యోల్బణం, జీఎస్టీలతో నిలువుదోపిడి చేస్తున్న తీరుపై స్పష్టత లేకుండా ఎంతకాలం మోసం చేస్తారు. అచ్ఛేదిన్ వాగ్దానం చేసి మరచిపోతే ఎలా అన్నది మోడీ గుర్తు చేసుకోవాలి. పాలకులు తాముచేసిన వాగ్దానాలపై కసరత్తు చేయకుండా మరింతగా ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎలా అన్నది మననం చేసుకోవాలి. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్.. అమృత్ కాల్, ఆజాదీకా అమృత్ మహోత్సవం ఇలా నినాదాలతో ప్రజల కడుపులు నిండవని గుర్తించాలి. అవరోధా లను, అవకాశాలను పారదర్శకంగా చర్చించి, భవిష్యత్ మార్గాన్ని సూచించడం విజ్ఞత అవుతుంది. కానీ సమస్యలను ముందు పెట్టుకుని వాటిని లేనట్లుగా చూపడం మోసం అవుతుంది. దేశ ఆర్థిక పరిస్థితి గతంలో ఓమారు దిగజారిన వేళ అప్పట్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పివి నరసింహారావు నడుం బిగించి చక్కదిద్ది, ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పడిపోతున్న రూపాయిని పట్టుకుని లేపారు. విదేశీమారక నిల్వలను నిలబెట్టారు. ఇప్పుడలాంటి చొరవ కానీ, దక్షత కానీ పాలకులుకు లేకుండా పోయింది. కనీసం ఎందరికో భారతరత్నలు ఇస్తున్న ప్రభుత్వం పివి దార్శనికతను గుర్తించి..ఆయనను గౌరవించక పోవడం దారుణం కాక మరోటి కాదు. కనీసం ఆయన చూపి దక్షతనయినా పునికిపుచ్చుకోవడం లేదు. అనుత్పాదక రంగాలకు నిధులను వేలం వెర్రిగా ఖర్చు చేస్తూ పోవడం, దిగుమతులు పెంచడం వంటి చర్యలు దేశీయంగా ఆర్థికరంగాన్ని దెబ్బతీస్తూ వస్తోంది. ఉచిత పథకాలకు మంగళం పాడాల్సింది పోయి వాటిని పెంచుతు న్నారు. ఈ విషయంలో రాష్ట్రాలు విచ్చలవిడిగా నిధులను దుర్వినియోగం



చేస్తున్నాయి. దీనిని అర్థం చేసుకోని నేతల కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. తాజాగా మరోమారు ఇలాంటి భయాలు వస్తున్న వేళ కేంద్రం దిద్దుబాటు చర్యలు పూనుకోకుండా నినాదాలకే పరిమితం కావడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం కాక మరోటి కాదు. ప్రజలు, పరిశ్రమలు, ప్రభుత్వం ఎక్కువ మొత్తాలను పొదుపు చేసి, ఆ నిధులను పెట్టుబడులుగా ఉపయోగించి, వస్తుసేవల ఉత్పత్తినీ, ఎగుమతులనూ వృద్ధి చేసినప్పుడు మాత్రమే స్థిరమైన ప్రగతిని సాధించగలం. దిగుమతులను తగ్గిస్తూ పోతూ, ఎగుమతలుపై దృష్టి పెట్టాలి. అనవసర వస్తువులను అదేపనిగా దిగుమతి చేసుకోవడం తగ్గించాలి. ఇబ్బడిముబ్బడిగా ప్రపంచ మార్కెట్ మనపై పెత్తనం చేయకుండా చూసుకోవాలి. భారత్ లాంటి దేశాల్లో పన్నులు సరళీకృతంగా ఉండాలి. జీఎస్టీని 28 నుంచి 5 శాతానికి పరిమితం చేయాలి. పన్నుల పేరుతో ఎలా బాదుతున్నారో చర్చించాలి. రకరకాల పన్నులపై చర్చించాలి. అవసరమైతే పార్లమెంటులో ప్రత్యేకంగా చర్చించే ధైర్యం చేయాలి. బ్యాంకుల రుణ వితరణలో లక్ష కోట్ల రూపాయల తరుగుదల కనిపించిందని రిజర్వుబ్యాంకు వెల్లడించడం గమనిస్తే, గిరాకీ మందగించడం వల్లనే కొత్త పరిశ్రమలు, వ్యాపారాలను పెట్టడానికి రుణాలు తీసుకునేవారు కరవవు తున్నారని స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ మాంద్యానికి గురవుతూనే ఉంటుంది. అది సహజ పరిణామం కూడా. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఒక సరళ సూత్రాన్ని పాటించి విజయం సాధించాయి. భారత్ కూడా అలాంటి ఉద్దీపన విధానాన్ని చేపట్టాలి. కొన్ని రంగాలు తమ సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగించలేక పోయాయి. ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచితే ఆర్థిక వ్యవస్థలోకి ధన ప్రవాహం, దానితోపాటే గిరాకీ పెరిగి, పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకుంటాయి. దీనికి ఉద్దీపనలు ఇవ్వాలే తప్ప కొందరు కార్పోరేట్లకు రుణాలను మాఫీచేయడం, ఎగవేతదారుల రుణాలను మాఫీ చేయడం దేశ అభివృద్ధి కాదు. అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడే భాగ్యం కలిగిందని సంతోషపడుతున్న వేళ రూపాయితో పోల్చుకుంటే మనం ఎప్పటికీ బలహీనంగానే ఉంటున్నాం. బలహీన దేశాలైన సూడాన్ లాంటి దేశాల్లో మాత్రమే మనం బలవంతులం. 75ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ వెనక్కి తిరిగి చూస్తే మన ఆర్థిక ప్రగతి బలపడిందా లేక బలహీన పడిందా అన్నది రూపాయిని అడిగితే చెబుతుంది. ప్రధానంగా మనం రూపాయిని డాలర్‌తో పోలిస్తేనే మన బలం గురించి తెలుస్తుంది. డాలర్ మనకు అందనంతగా ఎదిగి పోతోంది. ఇది డాలర్ బలమో లేక మన రూపాయి బలహీనతో కానీ పాలకులు మాత్రం ఘనంగా అభివృద్ధి గురించి ఢంకా బజాయిస్తున్నారు. అంతెందుకు నోట్ల రద్దు జరగక ముందు ఉన్న 500 రూపాయల విలువ ఇప్పుడు కొత్త రెండు వేల నోటుకు లేదంటే నమ్మగలమా? కానీ నమ్మాలి. ఆనాటి 500 నోటు ఇవాల్టి రెండు వేల నోటు ఒకటే అన్న సంగతి బజారులో అడుగుపెడితే సామాన్యుడే చెబుతాడు. ప్రతి భారతీయుడికి ఇల్లు, విద్యుత్తు, గ్యాస్, నీరు, మరుగుదొడ్డి, నైపుణ్యాభి వృద్ధి, వైద్యం, బీమా వంటి సౌకర్యాలు అందాలి. దేశాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పడం కాదు చేసి చూపాలి. అప్పుడే దేశం పురోగమిస్తుంది.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# చెట్టుగా మారని మొలక

ఒళ్ళు విరుచుకొని నెలపోరల్ని చీల్చుకొని తల బయటపెట్టింది ఓ చిరుమొలక. చీకట్లోంచి వెలుగులోకి ఇప్పుడే రావడం వలన వెలుగుకు మెల్లమెల్లగా కళు ్ళతెరుస్తోంది మొలక. కాసేపటికి కళ్ళు వెలుగుకు అలవాటు పడ్డాక చిరుమొలక తలతిప్పి చుట్టూ చూసింది. తన చుట్టూ చాలా పెద్ద పెద్ద చెట్లున్నాయి. దూరంగా 'లిటిల్ ఫ్లవర్ స్కూలు' అనే బోర్డు కనిపిస్తోంది. హమ్మయ్య నా అదృష్టం పండింది. బడిలో పుట్టాలని ఎంతగానో కోరుకున్నది ఈ రోజు తన కోరిక తీరినందుకు ఎంతగానో సంతోషించింది. చిరుమొలక బడిలో ఎందుకు పుట్టాలనుకున్నాడో చాలా పెద్ద కారణమే ఉన్నది.

రోజు పసిపిల్లల నవ్వుల మొహాలు చూడాలని, వారి ముద్దు పలుకులు వినాలని అనుకున్నది. ఇంకా పసిపిల్లల లేత పాదాల నర్తనలు చూసి తలలు ఊగించాలని అనుకున్నది. ఇంకా వారి పసిమోహాలకు ఎండ తగలకుండా నీడనిచ్చే గొడుగులా తాను మారాలని అనుకున్నది. పిల్లలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ ను అందించాలనుకున్నది. ఇలా ఎన్నో రకాల కోరికలున్నాయి చిరుమొలకకు. కానీ కొన్ని రోజుల్లోనే ఈ ఆనందమంతా ఆవిరైపోయింది. చిరుమొలక అక్కడి పరిస్థితులకు ఆశ్చర్యపోయింది. తన తండ్రి, తాతలు చెప్పినట్లుగా పిల్లలు ఆనందంగా లేరు. బస్తాలు మోసే కులీల్లా పిల్లల వీపులపై బ్యాగులు అప్పట్లో మునిగిపోయిన వ్యక్తిలా ఆందోళనగా మొహాలు, ఎప్పుడు ఏదో హడావిడి. కాసేపట్లో యుద్ధం జరగబోతుందన్నంతగా గబగబా పనులు. ఒకళ్ళనొకళ్ళు పలకరించుకోవటాలు లేవు,

కేరింతలు, తుళ్ళింతలు అసలే లేవు. నవ్వులు మరచిన మోహాలకు కళ్ళజోళ్ళు.

ప్రయోగశాలల్లో ఉన్న శాస్త్రవేత్తల్లా ఏదో ఆలోచనల్లో మునిగిపోయి, ఎటు వెళు ్తన్నారో తెలియకుండా, వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటూ ఏదో విషయాలు నెమరవేసుకుంటూ నడుస్తున్నారు. ఇరవై నాలుగ్గంటలూ పుస్తకాలు కళ్ళముందే పెట్టుకొని చదవడం, వందలసార్లు



ఇంపోజిషన్లు రాయడం, స్లిప్ టెస్ట్ ల పేరుతో రోజు టెన్షన్ పడటం %--% ఇదే వారి జీవితం.
ఇలా స్కూలు పిల్లల జీవితాన్ని చూసిన మొలక చాలా బాధపడింది. ఎన్ని రోజులు చూసినా ఆది వారాలైనా వారి దినచర్యలో మాత్రం ఏ మార్పులేదు. మైదానంలో ఆతలైన ఆడుకుంటారేమో అని చూస్తే వారికి డ్రిల్ పీరియడే లేదట. ఇలా మొక్కకు విసుగొచ్చింది. వాళ్ళ నవ్వులు చూసి తాను మురిసిపోవాలనుకుంటే అసలు తనను గమనించేవాళ్ళే లేరు. 'ఛీ' ఏమిటి జీవితం అనుకున్నది. తాను బతకటమే వృధా అనుకుంది. ఆ స్కూలు పిల్లల దీర్ఘ నిశ్వాసాలలోని సాంద్రతకు మొక్క చచ్చిపోయింది. అయిన ఎవరు పట్టించుకోలేదు.
ఉదయాన్నే తోటమాలి మొక్కలకు నీరు పోద్దామని వచ్చేసరికి మొక్క తలవాల్చేసి ఉంది. 'ఇదేంటబ్బా! మొక్క చచ్చిపోయింది' అని ఆశ్చర్యపోయాడు. 'సారవంతమైన ఎర్రమట్టి, పైగా ఎండ తగిలే ప్రదేశం, నేనేమో రోజు నీళ్ళుపోస్తున్నాను, ఇన్ని రకాలుగా అంతా బాగున్నా కూడా ఎందుకు చచ్చిపోయింది 'మొక్క' అని ఆలోచించి, ఆలోచించి తల బాదుకున్నాడు తోటమాలి.
కానీ తోటమాలికేమీ తెలుసు ఏదైనా బతికి ఉండాలంటే ఆహారం, నివాసం మాత్రమే కాదు ఆనందం కూడా ముఖ్యమని.

డా.. కందేపి రాణీప్రసాద్. సిరిసిల్ల

# మొగల్ విస్తరణను అడ్డుకున్న వీరుడు పాపన్న

## ఆగస్టు 18...సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

ఛత్రపతి శివాజీ సమకాలికుడు, మొగలాయి పాలకులను ఎదిరించిన ధీరుడు, సమర్థ నాయకుడు, పాలకుడు, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక, బహుజన హృదయ విజేత సర్దార్ సర్వాయి పాపన్న. శివాజీ, ముస్లింల పాలనా అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణలో ముస్లింల పాలనా అంతానికి పోరాడాడు. శివాజీకి పాపన్న ఏ మాత్రం తక్కువ కాదు. దక్షిణ భారత దేశంలో మొగల్ సామ్రాజ్య విస్తరణను అడ్డుకున్న తొలి యోధుడు పాపన్నే. యావత్ భారత దేశాన్ని, దాదాపు ఆనాటి భారత రాజులు అందరినీ ఓడించిన ఔరంగ జేబు మాత్రం పాపన్న ముందు తల దించుకున్నాడు. మళ్లీ అదే మొగల్ చక్రవర్తి తర్వాత వచ్చిన బహదూర్ షా తో సన్మానం చేయించుకున్న పోరాట యోధుడు సర్దార్ పాపన్న. అత్యంత క్రూరులు, భయంకరమైన మొగల్ సుల్తాన్లనే కాదు, గోల్కొండ సేనాధిపతులను, గవర్నర్ లనే ఎదిరించి నిలబడి, వారి దౌర్జన్యాలను, అక్రమాలను ప్రశ్నించాడు. బహుజనుల ఐక్యతతో
రాజ్యాధి కారం సంపాదించ వచ్చునని నిరూపించాడు. పూలే కంటే ముందే సామాజిక న్యాయాన్ని ప్రపంచానికి అందించాడు. బలహీన కుటుంబంలో పుట్టి 17 వ శతాబ్ది లోనే తెలంగాణ గడ్డపై పోరుబాట పట్టి, రాచరిక పునాదులను కదిలించిన ధీరోధాత్తుడు సర్వాయి పాపన్న. పాపన్న సామాన్య గీత కార్మికుడు. తన మిత్రుడి మీద కాలు లేపిన నిజాం సైనికుడిని తన వద్ద ఉన్న గీత కత్తితో తల నరికిన ధీరుడు పాపన్న. తర్వాత తన మీద దాడికి వచ్చిన 10 మంది సైనికుల్ని మట్టుపెట్టి వాళ్ళ గుర్రాలను తీసుకొని కొంతమంది మిత్రులతో, దౌర్జన్యం చేస్తున్న నిజాం సైనికులని నరకటం మొదలు పెట్టాడు. అలా 1687 %--%1724 వరకు అప్పటి మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడాడు. పాపన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు నిర్మించాడు. 1678 వరకు తాటి కొండ, వేములకొండలను తన ఆధీనంలోకి తెచ్చుకొని దుర్గాలను నిర్మించాడు.

ధూల్మిట్ట శాసనం ప్రకారం ఆగస్టు 18, 1650 నాడు పాపయ్య, గౌడ్ కులంలో సర్వాయి పాపన్న నేటి వరంగల్ జిల్లా, జనగాం మండలం ఖిలాషాపూర్ గ్రామంలో జన్మించాడు. తండ్రి ధర్మన్నగౌడ్ ను చుట్టు పక్కల వారు గౌరవంతో ధర్మన్న దొర అనేవారు. తండ్రి చిన్నతనం లోనే చనిపోగా, తల్లి సర్వమ్మ కోరిక అతన్ని మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు. స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాండ్లు, దూదేకుల పీర్ మహ్మద్, కొత్వాల్ మీర్ సాహెబ్ తో గెరిల్లా సైన్యాన్ని తయారు చేశాడు. అగ్రకుల భూస్వాములు, వ్యాపారుల గడీలపై, కోటలపై దాడి చేశాడు. సంపదను బహుజన పేదలకు పంచాడు. గడీల్లో బందీలుగా మగ్గుతున్న అణగారిన కులాల ప్రజలను విడిపించాడు. బాల్యంలో పశువులను కాస్తూ ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు గమనించాడు. తల్లి సర్వమ్మ పెంపకంలో గారాబంగా పెరిగాడు. పాపన్న వంశం శైవ



మతస్థులు కాగా, యుక్త వయసు వచ్చే నాటికి క్రమ క్రమంగా వ్యతిరేకించాడు. గోల్కొండ కుతుబ్ షాహి రాజవంశం నియంత్రణ లోకి రాగా, తురుష్క సైనికులు వివిధ పన్నులు, శిస్తులను ప్రజలను హింసలకు, ఇబ్బందులకు గురిచేస్తూ, కులాల, మతాల పేర్లతో పీడించి వసూలు చేసేవారు. అలాగే గౌడ కులం వారికి తాటి చెట్లకు పన్ను వేశారు. తురుష్క సైనికులు శిస్తులు వసూలు చేసుకొని వెళ్లేదారిలో, పాపన్న కల్లు అమ్ముకొనే మండువాలో, కల్లు తాగి డబ్బులు ఇవ్వకపోగా, పాపన్న స్నేహితుడు ఒకరు ధనరాసులు ఉన్నా, కల్లు తాగి డబ్బులు ఇవ్వలేని నిరుపేద తురుష్క సైనికులు వెళ్లిపోవుటకు సిద్ధం అయ్యారా అని సరసంగా అన్నాడు. తురుష్క సైనికుల్లో ఒకడు కోపంతో పాపన్న స్నేహితున్ని తన్నుటకు కాలు ఎత్తాడు. అది చూసిన ఆ క్షణంలో కోపోద్రిక్తుడైన పాపన్న తన వద్ద కల్లు గీయడానికి ఉపయోగించే గీత కత్తి, మారు కత్తిలో ప్రాణ స్నేహితున్ని తన్నుటకు కాలు ఎత్తిన సైనికున్ని మెడ నరికాడు, మిగతా సైనికులు తన మీదికి రాగా, బలవంతుడైన పాపన్న వారిని కూడా హత మార్చాడు. మెల్లగా తురుష్క రాజ్యంలో విప్లవకారుడు అయ్యాడు. పాపన్న, అతని స్నేహితులతో కలిసి తిరుగు బాట్లు ప్రారంభించాడు. అలా మొదలైన తిరుగు బాటుతో ఆయుధాలు, గుర్రాలు, డబ్బులు కూడా సమకూర్చు కున్నాడు. యుద్ధ విద్యలు నేర్చు కున్నాడు. పేదవారికి డబ్బులు సహాయం చేయడంతో పాపన్న పేరు జనగాం ఏరియాలో మారు మ్రోగింది. యువకులు పెద్ద సంఖ్యలో పాపన్న వద్ద సైనికులుగా చేరారు. వారికి యుద్ధ విద్యలు నేర్పించి, అతి తొందరలోనే 3 వేల మందిని సొంతంగా సైనికులుగా సమకూర్చు కున్నాడు.

బహదూర్ షా గోల్కొండ కోట ముట్టడి చేయడానికి అనేక వేల మంది బలగాలను పంపగా, మార్చి 1710 వరకు కొనసాగిన సుదీర్ఘమైన యుద్ధం జరుగుచున్న రోజుల్లోనే ఓ రాత్రి పాపన్న బావమరిది చేత పట్టుబడ్డాడు. కొద్ది రోజుల తరువాత హతమార్చ బడ్డాడు. తలను నరికి బహదూర్ షాకు బహుమానంగా పంపారు. మొండాన్ని గోల్కొండ కోట గుమ్మానికి వేలాడ దీశారు. పాపన్న రాజ్యంలో పన్నులు లేవు. ఆయన అనేక ప్రజామోద యోగ్య పనులు చేశాడు. ఆయన రాజ్యంలో సామాజిక న్యాయం పాటించేవాడు. తాటికొండలో చెక్ డాం నిర్మించాడు. ఎల్లమ్మకు పరమ భక్తుడై, హుజురాబాద్ లో ఎల్లమ్మగుడి కట్టిం చాడు. పాపన్న గొప్పతనాన్ని తెలుసుకున్న బ్రిటిష్ వారు లండన్ మ్యూజియంలో ఆయన ఫోటోను పెట్టుకున్నారు.

ఆదిలాబాదు జిల్లా, నిర్మల్లో 2012 జూలై 30 నాడు సర్వాయి పాపన్న విగ్రహం ప్రతిష్ఠించ బడింది. 2012 ఆగస్టు 18 నాడు కరీంనగర్ జిల్లా సర్వాయిపేట గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహం నాటి కరీంనగర్ లోకసభ సభ్యుడు పొన్నం ప్రభాకర్ చే ఆవిష్కరించ బడింది. ఇటీవలి కాలంలో పాపన్న గొప్పతనానికి క్రమంగా గుర్తింపు వస్తోంది. తెలంగాణ ప్రాంతంలో పరాయి పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా, అన్యాయానికి ధిక్కారంగా, ఆత్మగౌరవ నినాదంతో అధికారం చేపట్టిన తెరాస ప్రభుత్వ హయాంలో సర్దార్ పాపన్నకు సముచిత స్థానం, గౌరవం కల్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494




### తెలుగు భాషాభిమానుల, పాఠకుల కోసం....

తెలుగు భాషపై అభిమానంతో, అనురక్తితో గత నెలరోజులుగా, బహుభాషావేత్త, భాషాశాస్త్రవేత్త, పండితుడు, అనువాదకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ బిరుదుచే గౌరవింపబడిన డా. నలిమెల భాస్కర్,. ప్రతి రోజు ముఖపుస్తకంలో రాస్తున్న విలువైన తెలుగు భాషా సొగసులను, విరుపులను, జాతీయాలను, వాడుక పదాల పుట్టుపూర్వోత్తరాలను కలగలిపి, ఇతర భాషలలో ఉన్న సమానార్థకాలను విశ్లేషిస్తున్నారు. ఆయన కలం నుండి జాలువారుతున్న అనేక అంశాలను, తెలుగు భాషపై అనురక్తిగల పాఠకుల కోసం ప్రతిరోజూ కొన్నిటిని అందిస్తున్నాం. -ఎడిటర్

చాలా రోజుల తర్వాత ఫేస్బుక్ మిత్రుల తో తెలంగాణ భాషా విషయాలు కొన్నింటిని పంచుకోవాలనిపించి ఈ నాలుగు మాటలు రాస్తున్నాను.ధరల పెరుగుదల అంశంలో"కొనబోతే కొరివి(సగం సామెతే)",ధరలు మండిపోతున్నాయి"...వంటి వాక్యాలు వింటుంటాం మామూలుగా. తెలంగాణ లో"ఏది కొందామన్నా అగ్గిల చెయ్యి పెట్టినట్లుంది"అంటున్నారు.మండు వేసవిలో"ఎండ చంద్ర నిప్పులు చెరుగుతున్నది"అనేది మనం ఎప్పుడూ వినేదే!కానీ, తెలంగాణ లో"ఎండ కొర్రాయోలె కొడుతున్నది"అనీ,"అగ్గి కురుస్తున్నది"అనీ వినిపిస్తుంది.అయిష్టాన్నీ,విసుగు నీ ప్రదర్శిస్తూ"తగలడనీ"అనే తెలుగు మాటతీరు తెలంగాణల"అగ్గి తల్గని"అని వుంది."అగ్నిపరీక్ష"అనే తెలుగు సమాసం"మంటల పడ్డట్లైంది..నిప్పులమీద బొర్రిచ్చినట్లుంది"అనే వాక్యరీతుల్లో తెలంగాణ లో వుంది."ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుంది"కి సమానంగా "ఇద్దరికి పొయ్యిల ఉప్పు పోసుకున్నట్లే వుంది"అనే అభివ్యక్తి వుంది. కండ్లల్లో నిప్పులు పోసుకోవటం..కండ్లమంట..కడుపు మంట..తెలుగు లోనూ, తెలంగాణ లోనూ ఒకటే !.ఐతే..శిష్టవ్యావహారికంలో"ఆకలితో కడుపు నకనకలాడుతుంది"అనే వాక్యం,తెలంగాణ లో "కడుపుల సురసుర మంటది"అనే విధంగా వుంది.మరి..కడుపు నకనక ఏమిటి?అది.నకనక కాదు.కనకన..ఇంకా..కణకణలాడటం ఆకలిమంటకు.తెలంగాణ సురసుర..చురచుర అనటం.కొందరు చురచుర చూస్తే..మరి కొందరు కొరకొర చూస్తరు.చివరకు.. ఓ పొడుపుకథ.."గుట్టలు కాలంగ బట్టలు ఎండేస్తరు".విడుపు..రొట్టెలు కాల్చటం పొయ్యి మీద.ఈ పొడుపులోని ఊహాశక్తి..కవితాగుణం..లయ(ప్రాస)..మొ. వి మాటలకందనివి కదా!

డా.నలిమెల భాస్కర్,.
(12-07-2022)

### చతుర్విధ ఫల పురుషార్థాలు ( చింతన )

తిరుమల,ఆగస్ట్17 : చతుర్విధ ఫల పురుషార్థాల గురించి మన సనాతన ధర్మం వివరించింది. ధర్మంగా అర్థం (ధనం) సంపాదించి, ధర్మంగానే కోరికలను తీర్చుకుంటూ మోక్షప్రాప్తి పొందమని చెప్పింది. విజయం సాధించడానికి పట్టుదల అవసరమే కాని అది మొండిపట్టుదల కాకూడదు. సాహసం అవసరమే కాని దుస్సాహసం కారాదు. ఆలోచన అవసరమే, దురాలోచనగా మారకూడదు. అవసరమైన చోట అణకువ, వినయం, విధేయత, మౌనం కూడా ఆయుధాలుగా మారాల్సి వస్తుంది. మూర్ఖుల సభలో ఒకేఒక పండితుడు న్నప్పుడు, అతడు మౌనంగా ఉండటమే సమంజసం. ఒకవేళ ఏదైనా మాట్లాడినా, మూర్ఖులు లెక్కచేయక పోగా అవమానిస్తారు, అవహేళన చేస్తారు. వర్షరుతువులో చెరువుల దగ్గర కప్పల బెకబెకలే బాగా వినిపిస్తాయి. అటువంటి సమయంలో కోకిల తన పంచమస్వరం వినిపించక మౌనంగానే ఉంటుంది.

# తిరోగమన ఆర్థిక విధానాలతో నష్టం

## ఉక్రెయిన్ యుద్ధమూ సంక్షోభానికి కారణం

న్యూఢిల్లీ,ఆగస్ట్17 : పెద్దనోట్ల రద్దు వంటిచర్యల కారణంగానే ఆర్థిక సంక్షోభం ఉత్పన్న మైందన్న వాదన ఇప్పటికీ ఉంది. ఎందుకంటే ఆనాటి నుంచి నేటి వరకు ఆర్థికరంగం తిరోమనంలోనే ఉంది. తన అధికారాన్ని దుర్వినియోగ పరుస్తూ మోదీ ప్రభుత్వం రిజర్వుబ్యాంకును నోరులేని దానిగా మార్చి వేసిందని విపక్షాలు అంటున్నాయి. ఆర్థిక రంగంలో కొత్త ఉత్పాతాలను తట్టుకొని నిలబడగల స్థితిలో ప్రజలు లేరు. ద్రవ్యోల్బణం అదుపు తప్పితే మరిన్ని కష్టాలు తప్పవు. బ్యాంకు వడ్డీరేట్లు పెరగడం, రుణాలమీద ప్రభావం వంటి సమస్యలు కూడా అనేకం. రూపాయి పతనమవుతున్నందున పెట్టుబడిదారులు డాలర్ సురక్షిత మైనదిగా భావించడంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు కూడా తరిగి పోతున్నాయి. డాలర్ విలువ కారణంగా వాణిజ్యలోటు హెచ్చుతూ ఐదేళ్ళ గరిష్టానికి చేరింది. రూపాయి విలువ తగ్గుదలతో ఎగుమతులకు మేలు జరగవచ్చని కొందరంటున్నారు. అయితే ఇప్పటికే అమెరికా, ఐరోపా మార్కెట్లలో విధించిన నిబంధనలవల్ల వాటికి ముప్పు ఏర్పడిన వాస్తవాన్ని విస్మరించరాదు. అంతేగాక దిగుమతుల భారం వల్ల ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టాన్ని గుర్తించాలి. డాలర్లు మన దేశం నుంచి తరలి పోకుండా పరిమితం చేయడానికి విలాస వస్తువుల విచ్చలవిడి దిగుమతులపై ఆంక్షలు విధించడం అవసరం అన్న భావనా ఉంది. దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ఆర్థిక విధానాల వైపు ఇప్పటికైనా మళ్లాల్సి ఉంది. ఉక్రెయిన సంక్షోభం ఇప్పట్లో తీరేదికాదన్న వాస్తవం మరింత భయపెడుతున్నది. యుద్ధంతో వర్ధమాన దేశాల మార్కెట్లన్నింటినీ ప్రభావితం చేసింది. భారతీయ రిజర్వుబ్యాంకు జోక్యం పూర్తిస్థాయిలో లేనందునే రూపాయి ఇంతగా ఉన్నదని కొందరి వాదన. రూపాయి పతనం ఐటీ, ఎగుమతులు ఇత్యాది రంగాలకు మేలుచేస్తుందని అంటున్నారు కానీ, సామాన్యుడిపై ధరాఘాతం తప్పడం లేదు. దిగుమతి చేసుకొనే ఉత్పత్తుల ధరలు పెరిగిపోతున్నాయి. ఎగుమతులు,దిగుమతులను విశ్లేషించాలి. తాము తీసుకుంటున్న నిర్ణయాలు ఫలితం ఇవ్వడం లేదని గుర్తించి అందుకు కారణాలు విశ్లేషించాలి. చమురు దిగుమతులే మన కొంప ముంచుతు న్నాయని ఆర్థికవేత్తలతో సహా ప్రభుత్వాలు కూడా అంటున్నాయి. విపరీతంగా పెరిగిన చమురు ధరల కారణంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరగి పోతున్నాయి. అంతేగాకుండా రూపాయి మారకవిలువ దిగజారిపోతోందని అంటున్నారు.



## మెట్ పల్లిలో వీఆర్ఏలకు మద్దతుగా ఎం.పి. ధర్మపురి అరవింద్






**మెట్ పల్లి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** మెట్ పల్లి పట్టణంలో జగిత్యాల జిల్లా కేంద్రం లో వీ ఆర్ ఏ లకు మద్దత్తు తెలిపిన ధర్మపురి అరవింద్ ఎంపీ నిజామాబాదు, జగిత్యాల జిల్లా అధ్యక్షులు మోరపెల్లి సత్యనారాయణ రావు, బీజేపీ కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ జె యన్ వెంకట్, రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## రేపటి పొన్నం పాదయాత్రను విజయవంతం చేయండి

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి



**హుస్నాబాద్ ఆగస్టు 17 (ప్రజామంటలు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టిన పాద యాత్ర హుస్నాబాద్ నియోజక వర్గంలోకి ప్రవేశిస్తున్న సందర్భం గా పొన్నం పాద యాత్రను విజయ వంతం చేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి కోరారు. పొన్నం చేపట్టిన పాద యాత్ర ఎల్కతుర్తి లో గురువారం ముగుస్తుంది. ఎల్కతుర్తి మండలం కోతుల నడుమ వద్ద హుస్నాబాద్ నియోజక వర్గ పరిధి లోని అన్ని శాఖల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి పొన్నం పాదయాత్రకు స్వాగతం పలకాలని, ఎల్కతుర్తి లో నిర్వహించ బోయే పాదయాత్ర ముగింపు సభ ను విజయ వంతం చేయాలని ప్రవీణ్ రెడ్డి పిలుపు నిచ్చారు.

## హుస్నాబాద్‌లో "హర్ ఘర్ తిరంగా" యాత్ర

**హుస్నాబాద్ ఆగస్టు 17 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో 75వ భారత స్వాతంత్ర్య ఆజాద్ కా అమృత్ మహొత్సవాల సందర్భంగా ఆచార్య



జయశంకర్ సార్ సేవా సమితి ఆధ్వర్యంలో "హర్ ఘర్ తీరంగా" యాత్ర నిర్వహించారు. ఈ యాత్రకు ఆచార్య జయశంకర్ సార్ సేవా సమితి అధ్యక్షులు కందుకూరి జగదీశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... హుస్నాబాద్ పట్టణంలోని విద్యార్థులందరూ ఈ యాత్రలో పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయమని జాతీయ సమైక్యతకు నిదర్శనంగా 1000 మీటర్ల జాతీయ జెండాను విద్యార్థులందరూ పట్టుకొని హుస్నాబాద్ పట్టణంలో యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ యాత్రలో హుస్నాబాద్ పట్టణంలోని విద్యాసంస్థల్లో ఉన్నటువంటి విద్యార్థులందరూ పాల్గొన్నారు. ఈ యాత్రలో ఆచార్య జయశంకర్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో విజయవంతంగా కొనసాగుతున్న క్రీడలు

**జనగామ ఆగస్టు 17 (ప్రజామంటలు):** స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా గ్రామస్థాయి మండల స్థాయి లలో నిర్వహించిన క్రీడలను బుధవారం జిల్లా



కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా యువజన పర్యాటక క్రీడల శాఖ అధికారి గోపాల్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి రాము, జిల్లా పరిశ్రమల అధికారి రమేష్ హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ స్టేడియంలో వాలీబాల్ కబడ్డీ క్రీడలను ఏర్పాటు చేయగా నర్మెట్ట, లింగాల గన్ పూర్ మండలాల జట్టు క్రీడాకారులు వాలీబాల్ క్రీడలలో పాల్గొన్నారు. జనగాం, బచ్చన్నపేట మండలాల క్రీడాకారులు కబడ్డీ క్రీడ లో పాల్గొన్నారు. కబడ్డీ క్రీడకు క్రీడలఅధికారి గోపాలరావు టాస్ వేసి ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ క్రీడలను ఆయా పాఠశాలల పీఈటీలు నిర్వహించారు.

# వికలాంగుల పెన్షన్ 10వేలు ఇవ్వాలి

ఎన్పిఆర్డి తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం. ఆడవయ్య

**జనగామ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** సమస్యల సుడిగుండంలో వికలాంగులు కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోవడం లేదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం. అడివయ్య ప్రశ్నించారు. బుధవారం జనగామ పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు పాముకుంట్ల చందు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. ఆడవయ్య ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లా పరిధిలో సుమారు 25 వేల మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. వీరిలో కేవలం 11వేల మందికి పింఛన్లు అందుతున్నాయని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ రూ. 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ అనేక మందికి ధ్రువీకరణ పత్రాలు లేవని అన్నారు. స్లాట్ నిర్వహణలో చాలా లోపాలు ఉన్నాయని, ప్రభుత్వం గుర్తించిన 21 రకాల వైకల్యాల వారికి ప్రతి నెల సదరం క్యాంపులు నిర్వహించాలని, డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అందక అనేక మంది వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు, డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో నిరుపేద వికలాంగులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక అనేక మంది వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టణ ప్రాంతంలో ఉన్న వికలాంగుల కోసం పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టాలని, పట్టణ ప్రకృతి వనాలలో వికలాంగులకు, జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ మార్కెట్ ను త్వరగా పూర్తి చేసి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పరికరాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఒక్కరికి కూడా పరికరాలు ఇవ్వడం లేదన్నారు. మహిళా వికలాంగులకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పంపిణిలో చాలా లోపాలు ఉన్నాయని గ్రామాలలో పోస్ట్ మెన్ ల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని హెచ్చరించారు. ప్రతి నెల ఒకటవ తేదీ న ఆసరా పింఛన్లు పంపిణి జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి వాటిని భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని, దొంగచాటున భర్తీ చేస్తున్న ఉద్యోగాలను గుర్తించి, వాటిని నిరుద్యోగ వికలాంగులతో భర్తీ చేసేవరకు పోరాడుతామని హెచ్చరించారు. వికలాంగుల చట్టాలు సంక్షేమ పథకాల పట్ల అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. వికలాంగుల సాధికారత సమగ్ర అభివృద్ధి కోసం వికలాంగుల బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్




చేశారు. వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. స్వయం ఉపాధి రుణాల కోసం వేలాది మంది వికలాంగులు దరఖాస్తు చేసుకున్నా రుణాలు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. సర్వేలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దశలవారీ ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బిట్ల గణేష్, జిల్లా కమిటీ సభ్యులు తోట సురేందర్, తాడెం రాములు, బండవరం శ్రీదేవి, ఇట్టబోయిన మధు, మామిడాల రాజేశ్వరి, పిట్టల కుమార్, నామాల రాజు, బైరగోని మహేష్, నాచు అరుణ, మాలోతు రాజ్ కుమార్, రావుల శ్రీనివాస్, ఒండ్రు శ్రీశైలం, గొడుగు రాజవ్వ, బుడిగె జానకి పాల్గొన్నారు.

## కవి, గాయకుడిని ఘనంగా సన్మానించిన జాయింట్ కలెక్టర్

**చిగురుమామిడి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో జాయింట్ కలెక్టర్ జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అధ్యక్షతన జినవల్లభ సాహితివేదిక ఆధ్వర్యంలో మంగళవారం 75 వసంతాల వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామ నివాసి అయిన ప్రముఖ కవి, రచయిత, గాయకుడు కల్వల రాజశేఖర్ రెడ్డి కి పాల్గొనే అవకాశం లభించింది. ఈ కవి సమ్మేళనం లో, అమ్మ స్వాతంత్రమా అనే అంశంపై కవిత గానాన్ని చేసినందుకు గాను కవి ని కరీంనగర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఘనంగా సన్మానించి, వజ్రోత్సవ వేడుకల జ్ఞాపికను అందజేయడం జరిగింది. దాదాపుగా 200 కవితలు పరిశీలించి 75 మంది కవి, కవియిత్రులను ఎంపిక చేసామని కమిటీ కార్యవర్గ సభ్యులు, బెజ్జారపు రవిందర్, గాజుల రవిందర్ లు ఒక ప్రకటనలో తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంద్ర లక్ష్మణ రావు, కల్వకుంట్ల రామకృష్ణ, మాడిచెట్టి గోపాల్, నంది శ్రీనివాస్, కోవెల అనంతచార్య, వైరాగ్యం ప్రభాకర్, రజియా సుల్తానా, నలమాసు విజయ్ ప్రసాద్ లతో పాటు, జిల్లా కేంద్రంలో ఉన్న ఉన్నతాధికారులు ఒక్కొక్క ఆవృతానికి అధ్యక్షత వహించి, కవులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. వజ్రోత్సోవ వేడుకలో పాల్గొని కవి తా గానం చేసిన రాజశేఖర్ రెడ్డి కి, గ్రామ సర్పంచ్ సన్నీల్ల




వెంకటేశ్, ఉప సర్పంచ్ అన్నాడి మల్లిఖార్జున్ రెడ్డి, యం పిటీసి సభ్యులు కొమిటిరెడ్డి చంద్రకళ, రాంగోపాల్ రెడ్డి, కార్యదర్శి, వార్డు సభ్యులు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## రక్తదానం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు

**స్టేషన్ ఘన్‌పూర్ ఆగస్ట్ 17(ప్రజామంటలు):** రక్తదానం చేయడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం స్టేషన్ ఘన్ పూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో 75వ స్వతంత్ర వజ్రోత్సవాల సంధర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిధిగా మంత్రి ఎర్రబెల్లి హాజరైయ్యారు. ఈ సందర్బంగా స్థానిక ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వాతంత్ర ఉద్యమ స్పూర్తితోనే ఆనాటి ఉద్యమ రథసారథి కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం చేపట్టి రాష్ట్రం సాధించుకున్నా మన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. అనంతరం స్టేషన్ ఘన్ పూర్ తహసీల్దార్ కు మంత్రి ఎర్రబెల్లి ధ్రువపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, కలెక్టర్ శివ లింగయ్య, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్డివో రాంరెడ్డి, డీఎంహెచ్ఓ మహేందర్, సూపర్డెంట్ సుగుణాకర్ రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్, ఎంపీపీ కందుల రేఖ, జడ్పీటీసీ మారపక రవి, మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, తహసీల్దార్ పూల్ సింగ్



చౌహన్, సీఐ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పెంతల రాజ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ శ్రీవాణి, ఎస్ఐ శ్రవణ్, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం

**హుస్నాబాద్ ఆగస్టు 17 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలో భాగంగా హుస్నాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ నందు రక్తదాన కార్యక్రమంలో బస్వాపూర్ గ్రామం నుండి ఆరుగురు యువకులు రక్తం దానం చేయడం జరిగింది. రక్తం దానం చేసిన వారికి టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొక్కుల సురేష్. ఆర్డీవో జయచంద్ర రెడ్డి తో కలిసి ఫ్రూట్స్ పంపిణీ చేయడం జరిగింది. రక్తదాన శిబిరా కార్యక్రమంలో రక్తం రక్తదానం చేసిన యువకులు మంకాల నితిన్, ద్యావర శ్రీనివాస్ టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు గుమ్మడి సాయి శ్రీరామ్, మడిపడిక ప్రశాంత్, దబ్బెడ ఆనంద్, టిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మెంబర్ మంకాల రమేష్, గుంద్ర రాజు, టిఆర్ఎస్ ఎస్సి సెల్



కోహెడ మండల అధ్యక్షులు వేల్పుల శంకర్, యూత్ నాయకులు తోట రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ లోని ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ లో బాప్టిస్ట్ పితామహుడు డాక్టర్ రెవ. విలియం కేరి 261వ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. పాల్గొన్న స్కూల్ కరస్పాండెంట్ బక్క ప్రవీణ్ కుమార్, హెచ్.ఎం. లక్ష్మి నర్సమ్మ, టీచర్స్ బి. జయాశిల, బక్క సుమలత, సుమన్, నవనీత, దీప్తి, మేరీ, రవళి, ఎం.జయ నందమ్, అటెండర్ యాదగిరి.

## తెరాస మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలు, జెండా వందనం

**సికింద్రాబాద్ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయిన సందర్బంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకొని



బన్సీలాల్ పేట డివిజన్ తెలంగాణ రాష్ట్ర సమితి మైనార్టీ సెల్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కుర్మ హేమలత లక్ష్మీపతి జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈసందర్బంగా తెరాస నాయకులు, మైనార్టీ సెల్ సభ్యులు సామూహిక జాతీయ గీతాలాపన చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహనీయులు చేసిన త్యాగాలను ఈసందర్బంగా పలువురు తమ ప్రసంగంలో ప్రస్తావించారు. దేశభక్తి నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీ.ఆర్.ఎస్. మైనార్టీ సెల్ మెంబర్స్ పాల్గొన్నారు.

## నిట్ వరంగల్‌లో ఇంటర్నేషనల్ సెమినార్

**హన్మకొండ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** వరంగల్ నిట్, జేఎన్ టీయూ హైదరా




బాద్ సంయుక్తంగా ఇండస్ట్రీయల్ ఇంజినీరింగ్, ఆపరేషన్స్ మేనేజ్మెంట్ మంగళవారం ఉదయం 9గంటల నుంచి వర్చువల్ పద్ధతిన ప్రారంభమ య్యాయి. రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ ముఖ్యఅతిథిగా సదస్సు ప్రారంభించారు. నిట్ సంచాలకుడు ఆచార్య రమణారావు, జేఎన్టీయూ ఉపకు లపతి ఆచార్య కట్టా నర్సింహారెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో 25 దేశాల నుంచి ప్రతినిధులు ప్రత్య క్షంగా, అంతర్జాల సమావేశాల్లో పాల్గొంటారు. ఇందులో 650 పరిశోధన పత్రాలు అందగా అందులో 400 అంశాలు ఎంపిక చేశారు. ఇంజినీరింగ్ విద్యలో సవాళు ,, విద్యార్థులకు అవకాశాలు, ఐవోటీ, డేటా అనాలసిస్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, ఆటోమేషన్ తదితర అంశాలపై నిపుణుల సమక్షంలో చర్చిస్తారు.



రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలో మారబోయిన నడిపి యాదగిరి అనారోగ్యంతో మరణించగా అంత్యక్రియలకు శాగ ధనప్రకాష్ సుజనా ఫౌండేషన్ తరుపున 70వ కర్ర సహాయం చేసిన ఫౌండేషన్ చైర్మన్ శాగ దేవరాజ్.

## టీఆర్ఎస్ గుండాల దాడులకు భయపడి పాదయాత్ర ఆగిపోదు

**హన్మకొండ ఆగస్టు 17 (ప్రజామంటలు):** హన్మకొండ లో బీజేపీ ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి పరకాలలో బిజేపి నాయకుడు కాచం గురుప్రసాద్ పై టిఆర్ఎస్ గుండాలు పథకం ప్రకారమే దాడి చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే రాష్ట్ర అధికార చల్లా ధర్మారెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిజేపి ఎదుగుదలను చూసి ఓర్వలేక, ప్రజాస్వామ్య బద్ధంగా ఎదుర్కోలేక దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులే లక్ష్యంగా వరుసగా దాడులు చేయడం దారుణమన్నారు.



# విద్యుత్ అధికారి నిర్లక్ష్యం

**పాడి గేదే మృతి**

**జనగామ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** జనగామ జిల్లా పెంబర్తి గ్రామానికి చెందిన నిడిగొండ నర్సయ్యకు చెందిన పాడి గేదే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



వల్ల విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్ తో చనిపోయింది. పాలతో జీవనోపాధిని పొందుతున్న తనకు పాడి గేదే మృతితో తన జీవనోపాధి మీద దెబ్బ పడిందని, విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కూడా విద్యుత్ వైర్లు సరి చేయకుండా దండాలు వేలాడదీసినట్టు ఉండడంతో పాడి గేదే విద్యుత్ ప్రమాదానికి గురై చనిపోయినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం, అధికారులు ఎలాగైనా తన కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు కోరారు.కొత్త సబ్ స్టేషన్ కు 100 మీటర్ల దూరంలోనే విద్యుత్ వైర్లు దండాలుగా వేలాడుతున్న దృశ్యంతో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఎంతగా ఉందొ అర్థం చేసుకోవచ్చు.ఇప్పటికైనా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడి అప్రమత్తంగా ఉండాలని,అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



జనగామ పట్టణం లో టిఆర్ఎస్ వాళ్ళు అర్ధరాత్రి బిజెపి ఫ్లెక్సీలను చింపి నీచమైన రాజకీయానికి పాల్పడారని బిజెపి జనగామ జిల్లా ప్రచార కార్యదర్శి పెద్దోజు జగదీష్ ఆరోపణ.

# ఓటుతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి

**ఆర్డీఓ జయచంద్ర రెడ్డి**

**హుస్నాబాద్ ఆగస్ట్ 17 (ప్రజా మంటలు):** ఓటర్ ఐడి కార్డుతో ఆధార్



అనుసంధానం తప్పనిసరి అని హుస్నాబాద్ ఆర్డీఓ ఎం. జయచంద్ర రెడ్డి తెలిపారు. హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ ఎలక్షన్ సూపర్వైజర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఓటుతో ఆధార్ అనుసంధానం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు తెలియజేశారు. ఇప్పటివరకు ఆధార్ సీడింగ్లో హుస్నాబాద్ నియోజవర్గం మొదటి స్థానంలో ఉన్నందున అధికారులను మరియు కంప్యూటర్ ఆపరేటర్లను బూతు లెవెల్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. గరుడ యాప్ ద్వారా గాని, మీసేవ సెంటర్ ద్వారా గాని బూత్ లెవల్ అధికారికి స్వచ్ఛందంగా చేసుకొని పారదర్శక ఎన్నికకు మీ వంతు బాధ్యతగా భావించాలని కోరారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శ్రీమంతం

**గొల్లపల్లి ఆగస్టు 17 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం టు అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీకి శ్రీమంతం చేయడము జరిగినది గర్భిణీ స్త్రీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు రక్తహీనత ప్రభుత్వ



హాస్పిటల్ లో డెలివరీ గూర్చి కెసిఆర్ కిట్టు గూర్చి రోజు ఆహారంలో ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గుడ్లు మాంసకృతులు పిండి పదార్థములు బీట్రూట్ ఆహారంలో తీసుకొనవలెనని కడుపులో ఉన్న బిడ్డ పెరుగుదల బావుంటుందని గర్భిణీ స్త్రీ 10 నుంచి 12 కేజీల బరువు అదనంగా పెరగాలని తల్లులకు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీకి చీర బ్లౌజులు గాజులు పండ్లు స్వీట్స్ పూలు పసుపు కుంకుమ ఇవ్వడం జరిగినది వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకొనవలసిన జాగ్రత్తలు మరియు వాటి నివారణ గూర్చి తల్లులకు వివరించడం జరిగినది. గ్రామ సర్పంచి రాగం శంకరయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత ఏఎన్ఎం బుజ్జమ్మ, అంగన్వాడీ టీచర్స్ వి. రమాదేవి, ఎస్. రమాదేవి, జలజ, స్వప్న, ఆశ వర్కర్స్ రాధా, హరిమాల తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## రెండు నెలలుగా గాదెపల్లిలో

# 5 కుటుంబాలకు కుల బహిష్కరణ

- **పెద్ద మనుషులు చేసిన పంచాయతీ అంగీకరించనందుకు శిక్ష...!**
- **పోలీసులకు పిర్యాదు చేశారని గ్రామబహిష్కరణ**
- **చర్యలు తీసుకోని పోలీసులు**
- **జగిత్యాలలో తల దాచుకుంటున్న కుటుంబాలు**
- **మానవహక్కుల కమిషన్, జిల్లా ఎస్పీ కి బాధితుల ఫిర్యాదు**

**ధర్మపురి ఆగస్టు 17 (ప్రజామంటలు):** స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళు ళ్ళ కావస్తున్న పల్లెల్లో ఇంకా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతూనే ఉంది. దేశమంతా స్వాతంత్ర్య వజ్రోత్సవాలు జరుకుంటుండగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం గాదెపల్లిలోని 5 కుటుంబాలు మాత్రం కుల, గ్రామ బహిష్కరణకు గురై గ్రామాన్ని వదిలిపెట్టి వేరే చోట తలదాచుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రెండు నెలలు గడస్తున్న పోలీసులకు ఈవిషయమై పిర్యాదులు వెళ్లిన పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ఆగ్రామానికి వెళ్లి విచారణ జరుపడమే కాకుండా గ్రామ సభ నిర్వహించి రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధుల గురించి ప్రజలకు అవగాహనా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గాదెపెల్లి గ్రామానికి చెందిన కొంతమంది కలిసి హార్వెస్టర్ తీసుకోగా దానికి సంబంధించిన లేవాదేవిల విషయంలో వారి మద్య వివాదం కొనసాగుతుంది. దీనికి సంబందించిన వివాదంలో పెద్ద మనుషులు ఏకపక్షంగా పంచాయితీ నిర్వహించగా దాన్ని అంగీకరించక పోవడంతో పెద్ద మనుషులు తండ్రి కుటుంబంతో పాటు 4 గురు కుమారుల కుటుంబాలపై కుల, గ్రామ బహిష్కరణ చేసిన ఉదంతం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం గాదెపల్లిలో చోటుచేసుకుంది. మాకు న్యాయం చేసి గ్రామ, కుల బహిష్కరణ విధించిన వ్యక్తులపై చర్యలు తీసుకుని రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అయినా జీవించే హక్కును పరిరక్షించాలని మానవహక్కుల కమిషన్ చైర్మన్, జగిత్యాల జిల్లా ఎస్పీ కి బాధితులు వెలుగు సాయన్న, వెలుగు శేఖర్ లు 3 రోజుల క్రితం పిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం ఒక వివాదం విషయంలో ఇరువర్గాలకు పంచాయతీ జరుగగా నాకు అన్యాయం చేయాలనే దురుద్దేశంతో నాకు వ్యతిరేకంగా నిర్వహించిన పంచాయితీని నేను అంగీకరించకపోవడంతో పెద్ద మనుషులు రెండు నెలల క్రితం (జూన్ 15) నాకు, నా భార్య తో పాటు నా నలుగురు కొడుకుల కుటుంబాలను కుల బహిష్కరణ చేశారని వెలుగు సాయన్న తెలిపారు. వెలుగు సాయన్న, వెలుగు శేఖర్, వెలుగు గంగాధర్, వెలుగు సంతోష్, వెలుగు నరేష్ అనే 5 కుటుంబాలను కులబహిష్కరణ విధించి మా సామాజిక వర్గానికి చెందిన వారు ఎవరూ మాట్లాడిన 10 వేల జరిమానా విధించారని సాయన్న, శేఖర్ లు తెలిపారు. ఈవిషయమై మేము ధర్మపురి పోలీసులకు పిర్యాదు చేయగా కక్ష గట్టిన పెద్దమనుషులు ఏకంగా జూన్ 28 న మాకుటుంబాలకు గ్రామబహిష్కరణ చేశారని దాంతో గాదెపల్లిలో మా సామజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఎవరూ మాట్లాడడం లేదని, మాకు ఎవరూ వ్యవసాయ పనులకు రావడం లేదని, మమ్ములను పిలువడంలేదని , కిరాణాసరుకులు ఇవ్వడంలేదని,మా పశువులను మందలోకి తోలడలేదని, మాతో గ్రామంలో ఎవరూ మాట్లాడడంలేదని దాంతో మళ్ళీ ధర్మపురి సీఐ, ఎస్సై లకు పిర్యాదు చేయగా జులై 23 న గాదెపల్లికి వచ్చిన పోలీసులు విచారణ చేసినప్పటికీ వారిపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు వెలుగు సాయన్న, వెలుగు శేఖర్ లు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈనెల 12 న బండి మల్కన్న, అల్పట్ల సురేష్, చిదుగుల చిన్నయ్య, తలారి సాయన్న, బండి చిన్న గంగాధర్, వెలుగు గంగాధర్ తో పాటు మరికొందరు గుర్తు తెలియని వ్యక్తులు వెలుగు సంతోష్ పై ఇంటి వద్ద దాడి చేశారని దీంతో పోలీసులకు పిర్యాదు చేసి వారి సూచనల మేరకు చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించామని అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం మేము మా గ్రామానికి వెళ్లలేక జగిత్యాల లోనే తల దాచుకుంటున్నామని తెలిపారు. సదరు వ్యక్తులు గతంలోనూ మాపై రెండు, మూడు సార్లు దాడి చేశారని అట్టి వ్యక్తులపై పోలీసులకు పిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిర్యాదులో వివరించారు. ఈ విషయంలో మాకు న్యాయం చేయాలని పెద్ద మనుషులు విధించిన కుల, గ్రామ బహిష్కరణ ఎత్తివేసి, కుల, గ్రామ బహిష్కరణ విధించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్, జగిత్యాల జిల్లా ఎస్పీ లను బాధితులు వెలుగు సాయన్న, వెలుగు శేఖర్ లు వేడుకుంటున్నారు.

**బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలి....**

**జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, జిల్లా అధ్యక్షులు గంగారాం**

ధర్మపురి మండలం గాదెపెల్లి గ్రామంలో హార్వెస్టర్ లేవాదేవిలా విషయంలో నెలకొన్న వివాదాన్ని పెద్ద మనుషులు ఏకపక్షంగా పంచాయితీ నిర్వహించదాన్ని వ్యతిరేకించడం మూలంగా కుల, గ్రామ బహిష్కరణ చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంగించడమేనని జాతీయ మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాస మహేష్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు నక్క గంగారాంలు పేర్కొన్నారు. గాదేపెల్లి లోని వెలుగు సాయన్న తో పాటు అతని నలుగురు కుమారుల కుటుంబాలను కుల, గ్రామ బహిష్కరణ విధించిన పెద్ద మనుషలపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆ కుటుంబాలకు రక్షణ కల్పించాలని వారికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ని మహేష్, గంగారాం లు కోరారు.

# ధర్మపురి విద్యార్థి గోలి శ్రీలతకు ఓ.యూ. డాక్టరేట్

**ధర్మపురి ఆగస్టు 17 (ప్రజామంటలు):** ధర్మపురి క్షేత్రంలో పుట్టి, వివాహానంతరం జగిత్యాలలో స్థిరపడిన గోలి శ్రీలత ఉస్మానియా యూనివర్సిటీ నుండి పీహెచ్ డీ సాధించింది. ధర్మపురికి చెందిన శ్రీమతి జి .శ్రీలత ధర్మపురి చైతన్య భారతి విద్యా నికేతన్ పాఠశాలలో పదవ తరగతి చదివి శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాలలో బీ ఏ ఎల్ డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్నాతకోత్తర విద్యకై ప్రవేశ పరీక్షలో మూడవ ర్యాంకు సాధించి, తెలుగులో పీజీ పూర్తి చేసి, మాసబ్ ట్యాంక్ హైదరాబాద్ లో తెలుగు పండిత శిక్షణను పూర్తి చేసుకొని, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదులో "శేషప్ప త్రిశక్తి – ఒక పరిశీలన' అనే అంశంపై ఎం.ఫిల్ పూర్తి చేశారు. జగిత్యాల కు చెందిన పోచంపల్లి బాలగంగాధర్ ను వివాహమాడి అక్కడే స్థిర పడిన శ్రీలత, 2006 డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం పొంది, తర్వాత 2011 లో మళ్ళీ డిగ్రీ లెక్చరర్ గా ఉద్యోగం సాధించి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల లో 8



సంవత్సరాలు విధులు నిర్వహించి, ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్షట్టిపేటలో విధులు నిర్వస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో పి. హెచ్. డి లో ప్రవేశం పొంది, తెలుగు శాఖలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వెలుదండ నిత్యానంద రావు పర్యవేక్షణలో పి.హెచ్.డి. ని పొందారు. ఈ సందర్భంగా చైతన్య హై స్కూల్ కరస్పాండెంట్ సంగనబట్ల రామకిష్టయ్య, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గురువులు, జి. శ్రీలతను అభినందించారు.

# స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా రక్తదానం చేసిన టిఎన్జీఓలు

**జగిత్యాల ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** 75 సం.ల స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో భాగంగా బుధవారం జగిత్యాల ఏరియా వైద్యశాల లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో టిఎన్జీఓ లు అధిక సంఖ్య లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పాలనాధికారి జి.రవి , స్థానిక శాసనసభ్యులు సంజయ్ కుమార్ , జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించినారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు అధిక సంఖ్య లో పాల్గొని రక్తదానం చేయుటకు ముందుకు రావటం హర్షంచదగిన విషయమని వారు ఇచ్చిన రక్తం ఎంతో మంది ప్రజల కు ప్రాణాపాయ స్థితిలో ఉపయోగ పడుతుందని అన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత మాట్లాడుతూ వజ్రోత్సవాలలో భాగంగా ఉద్యోగులు రక్తదాన శిబిరం నిర్వహించటం సంతోషకరమని తెలిపారు. శాసనసభ్యులు సంజయ్ కుమార్ మాట్లాడుతూ టిఎన్జీఓ లు సామాజిక కార్యక్రమాల లో ఎప్పుడూ ముందుంటారని రక్తదానం చేసిన ఉద్యోగులందరిని ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి లను సన్మానించారు. జిల్లా కలెక్టర్ రక్తదానం చేసిన ఉద్యోగులందకి ప్రశంసా పత్రాలు అందజేసారు. ఆర్డిఓ మాధురి అండ్ డి ఎం హెచ్ ఓ శ్రీధర్ విచ్చేసి ఉద్యోగులను ప్రశంసించారు. .టిఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్ అండ్ జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి ల



ఆధ్వర్యంలో సుమారు 130 కి పైగా ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేసారు. జిల్లా అధ్యక్షులు శశిధర్ మాట్లాడుతూ వజ్రోత్సవాలలో భాగంగా ఉద్యోగులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసారని, మంచి కార్యక్రమం నిర్వహించినందుకు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీఓ నాయకులు సాహెద్ బాబు, రవిందర్, రాజేందర్ రావు, మధుకర్, రవి కుమార్, హరి ప్రసాద్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, బాబ్ జాన్, రాజేంద్ర ప్రసాద్, ఖాజిం, ప్రమోద్, మహేష్, రాహుల్, తిరుపతి, నగేష్, రాజేశం,శేఖర్, శ్రీకాంత్, దేవదాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# తెరాస హయాంలో కనీ వినీ ఎరుగని రీతిలో ధర్మపురి అభివృద్ధి

**వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాజేశ్**

**ధర్మపురి ఆగస్టు 17 (ప్రజామంటలు):** నిరంతర అభివృద్ధి, సంక్షేమ కాముకులైన స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ద్వారా ధర్మపురి నియోజక వర్గం ఊహించని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదని ధర్మపురి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అయ్యోరి రాజేశ్ అన్నారు. బుధవారం తెరాస నేతలతో కలిసి ఆయన నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ధర్మపురి నియోజకవర్గం, మండలం, టౌన్ మున్సిపాలిటీ ఏది చూసినా అభివృద్ధిలో ఈశ్వర్ ముద్ర కనిపిస్తోందన్నారు. అభివృద్ధిలో ఈశ్వర్ చరిత్ర నిర్మాతగా గుర్తింపు పొందిన విషయం గమనించాలన్నారు. పెన్షన్ ల విషయంలో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ చేసిన విమర్శలపై స్పందిస్తూ, గతంలో 2972 మాత్రమే పెన్షనర్లు ఉండగా. నేడు పట్టణంలో 2978, మండలంలో 10,590, నియోజక వర్గంలో 50,899 మంది ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. వరదల బాధితులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సాయం అందించగా, స్వంత డబ్బుతో సాయం చేసిన విషయాన్ని గుర్తెరగాలన్నారు. స్థాయికి తగ్గట్టుగా వ్యవహరించాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ మాట్లాడుతూ%ా%. తాను గతంలో రెండుసార్లు సర్పంచిగా ఉన్నానని, 2018లో పదవిలో లేనప్పుడు తన పని భర్త చనిపోగా, అప్పటి నుండి ఇప్పటి వరకు పెన్షన్ విషయం పట్టించు కాలేదని, ప్రస్తుతం జాబితాలో తన పేరు చూసి, తనకు వద్దని లిఖిత



పూర్వకంగా అందజేశానని, తనపై ఆరోపణ అర్థ రహితం అని, తమ జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్, మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ సునీల్, తెరాస మండల అధ్యక్షులు శేఖర్, ఆకుల రాజేశ్, నాయకులు అలీం, షబ్బీర్, యూనస్, శేఖర్, బాలరాజు, వసంత్, జెట్టి, వేణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్ మండల టీఆర్ఎస్ నాయకులు క్యాతం జీవన్ రెడ్డి సోదరుని కూతురు వివాహానికి, మల్లాపూర్ గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి ఆంజరెడ్డి కుమారుని వివాహానికి, సిర్పూర్ గ్రామానికి చెందిన గడ్డం శ్రీధర్ రెడ్డి కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. కల్వకుంట్ల సంజయ్.

# రేపటి నుంచి పురుషులకు కు.ని. శిబిరాలు

**హన్మకొండ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** హన్మకొండ జిల్లాలో పురుషులకు చేపట్టిన కోత, కుట్టులేని కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల శిబిరాలను విజయవంతం చేయాలని డీఎంహెచ్ వో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న హనుమ కొండ పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రంలో, 23న ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో, 25న హసన్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, 30న హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో వ్యాసెక్టమీ శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# అక్షరాస్యత డిజిటల్ బ్యాంకింగ్ జీవిత బీమాపై అవగాహన

**భీమదేవరపల్లి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సీహెచ్ లక్ష్మణరావు డిజిటల్ బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ పై




ప్రజలకు అవగాహన కల్పించారు. ఇటీవల తెలంగాణ గ్రామీణ బ్యాంకు వంగర శాఖలో ఖాతా ఉండి ప్రమాదవశాత్తు చనిపోయిన కత్తుల సమ్మక్క భర్త మల్లయ్య గట్లనర్సింగాపూర్ వాసికి ప్రమాద భీమా కింద పది లక్షల రూపాయల చెక్కును నామినీకి రీజినల్ మేనేజర్ చేతుల మీదుగా అందజేశారు. ఇన్సూరెన్స్ డిజిటల్ బ్యాంకింగ్, డిపాజిట్లు ఋణ సదుపాయంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో వంగర గ్రామ ఉప సర్పంచ్ నల్లగోనీ రాజు, బ్యాంక్ మేనేజర్ నిహారిక, నగదు అధికారి సురేష్, ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ బీడీఎం కుమార్, టీపీఎస్ రాజేష్, సుజాత, శోభారాణి వినియోగదారులు పాల్గొన్నారు.



గొల్లపల్లి మండలం శంకర్ రెడ్డి గ్రామానికి చెందిన గుర్రం మహేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ యూత్ మండల శాఖ ఉపాధ్యక్షుడు నియామకం

# వివిధ రకాల పదార్థాలతో రూపొందించిన త్రివర్ణ పతాకాల ప్రదర్శన

**గొల్లపల్లి ఆగస్టు 17 (ప్రజామంటలు):** ఆదర్శ పాఠశాల గొల్లపల్లిలో 75




జాతీయ పతాక సృజనాత్మక నామూనాల ప్రదర్శన ఆదర్శ పాఠశాల గొల్లపల్లి యందు పాఠశాల ఇంగ్లీష్ లాంగ్వేజ్ క్లబ్ ఆధ్వర్యంలో సృజనాత్మక త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఇందులో వివిధ రకాల పదార్థాలతో రూపొందించిన 75 త్రివర్ణ పతాక నమూనాలు ప్రదర్శించడం జరిగింది. ఆహార పదార్థాలు, కూరగాయలు, విత్తనాలు,ఆకులు,పూవులు తదితర వాటితో చేసిన ఆకర్షణీయ జెండా నమూనాలు చేసిన విద్యార్థులు తమ దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ విద్యార్థుల సృజనాత్మకతను అభినందించి ప్రోత్సాహించారు. ఈ ప్రదర్శనను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.నగేష్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ క్లబ్ కన్వీనర్ జి.వి. రమణ, ఉపాధ్యాయులు అరుణ్ కిరణ్,రాజశేఖర్, సతీష్, అజయ్, రమాదేవి, హరిప్రియ, సంధ్య, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.





# మండల బీజేపీ పార్టీ ఆఫీస్ ప్రారంభం

రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం

రావు పద్మ

**భీమదేవరపల్లి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** ములుకనూర్ బస్టాండ్ సమీపంలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, హుస్నాబాద్ నియోజక వర్గం ఇంఛార్జి చాడ శ్రీనివాస్ రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తెరాస



ప్రభుత్వంను, కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చెయ్యడమే ఏకైక లక్ష్యంగా బీజేపీ పార్టీ పని చేస్తుందని అనారు. తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. భీమదేవరపల్లి మండలంలో ప్రతి గ్రామంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు చేరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివన్న, తీగల భరత్, సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి మాచర్ల కుమార్, ప్రధానకార్యదర్శిలు గుండెల్లి సదానందం, గోదాల సంపత్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, పోల్సాని సుధాకర్ రావు, గండు సారయ్య, ఊసకోయిల కిషన్, సుద్దాల రఘు, దుర్గసింగ్, బుర్ర శివసాగర్, తీగల రాజు, మెట్టు అశోక్ రావు, అంభీర్ కవిత, పొడపర్తి రమేష్, ఉప్పుల కుమార్, మోలుగు సంపత్, బొల్లంపెల్లి శ్యామ్, ఊరడి యూగేందర్ రెడ్డి, అయిత సాయి, పిల్లి రవి, మరుపాక వివేక్, దొంగల రణధీర్, సింగం రాజేందర్, ఉదయ్, కుమారస్వామి, సాయి యాదవ్, ఈర్ల సదానందం, కొత్తపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న

# నాబార్డ్ జిల్లా అధికారి మనోహర్ రెడ్డి

**కరీంనగర్ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** రాజన్న సిరిసిల్ల:భారత స్వతంత్ర వజ్రోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల జిల్లాలో జరిగిన వేడుకల్లో, జిల్లాలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న నాబార్డ్ జిల్లా అధికారి పి.మనోహర్ రెడ్డి, ఐటీ, మునిసిపల్ శాఖల మంత్రివర్యులు కేటీఆర్ చేతులమీదుగా



ప్రశంసా పత్రమును అందుకున్నారు.వ్యవసాయ%ఽ% గ్రామీణ రంగంలో బహుళ ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యంతో జూన్ 2021లో నాబార్డ్ క్లస్టర్ కార్యాలయంను కరీంనగర్ లో ఏర్పాటు చేసింది.కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల జిల్లాల వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధికి నాబార్డ్ క్లస్టర్ కార్యాలయం కరీంనగర్ నుండి గ్రామీణ ప్రజలకు చేరువగా ఉండి, ప్రజలకు,బ్యాంకులకు సరియైన దిశానిర్దేశం చేస్తూ సేవలందిస్తున్నది.ముఖ్యముగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 3-వాటర్ షెడ్ లు (గంభీరావుపేట మండలంలో),8-రైతుల ఉత్పత్తిదారుల సంఘాలు,2-గ్రామీణ మార్కెట్ లు, 210- ఎస్ హెచ్ జి మహిళలకు వివిధ రకాల శిక్షణలు, ఎక్స్పోర్ట్స్ విసిట్ కొరకు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘముల అభివృద్ధి కొరకు పిఏసి ఎస్, ఎంఎస్ సి పథకములో భాగముగా గోదాములకు, షాపింగ్ కాంప్లెక్స్ మొదలగు వాటికి నాబార్డ్ ఆర్థిక సహాయం అందించి జిల్లా అభివృద్ధిలో నాబార్డ్ జిల్లా అధికారి పి.మనోహర్ రెడ్డి ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. మనోహర్ రెడ్డికి ప్రశంస పత్రం రావడం పట్ల రైతులు నాబడా అధికారులు హర్షణ వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# కోహెడ క్రాసింగ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఇద్దరు మృతి, కారు డ్రైవర్ పరార్

**కోహెడ ఆగస్టు 17 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాలలోని కోహెడ క్రాసింగ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సిద్దిపేట - హనుమకొండ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పరారయ్యాడు. మృతులు ఇద్దరు కోహెడ మండలం బత్తులవానిపల్లి గ్రామానికి చెందిన లింగాల బాలయ్య, రాగటి రాజులుగా గుర్తించారు. కోహెడలోని బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను 108 వాహనంలో హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పరారీలో ఉన్న కారు డ్రైవర్ ను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కోహెడ ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు.



# దేశానికే ఆదర్శం దళితబంధు పథకం

**దళితజనోద్ధరులు సిఎం కేసీఆర్**

**చిల్పూర్ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** దేశానికే ఆదర్శం దళిత బంధు పథకం .. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తే ప్రత్యేకంగా దళితుల ఆర్థిక అభివృద్ధికై ముఖ్యమంత్రి కేసిఆర్ గారు ప్రత్యేక చొరవతో అమలవుతున్న దళిత బంధు పథకంతో.. దళితులకు బంధువుగా మారారని స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే మరియు పాగాల సంపత్ రెడ్డి అన్నారు. బుధవారం జనగామ జిల్లా, చిల్పూర్ మండలంలోని రాజవారం గ్రామంలో ఏర్పాటు చేసిన దళిత బంధు లబ్దిదారుల ఆస్తుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మరియు జనగామ జెడ్పీ చైర్మన్ %ఽ% తెరాస జిల్లా అధ్యక్షులు సంపత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే ప్రథమంగా దళితుల బహుజనుల కోసం దళిత బంధు ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ పథకాన్ని అమలు చేసి ముఖ్యమంత్రి కేసిఆర్ గారు చరిత్ర సృష్టించారని అన్నారు. రాజ్యాంగంలో దళితుల కోసం డా. బి.ఆర్. అంబేద్కర్ పొందుపరిచిన అంశాలను పాటిస్తు, అంబేద్కర్ స్ఫూర్తితో దళితులకు సమాజంలో ఆర్థిక సమానత్వం కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్న పేదల దేవుడు కేసిఆర్ అని అన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే దళిత బంధు ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ కావడం ఒక విశేషమని అన్నారు. కేసిఆర్ గారి నేతృత్వంలో ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, అందుకు అనుగుణంగానే కేసిఆర్ గారి అద్భుత పాలనలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాల్లో, అభివృద్దిలో కొత్తపుంత తొక్కుతుందన్నారు. దళితులకు ఆలయాల్లో, పాఠశాలల్లో ప్రవేశం ఉండకపోవడాన్ని మనం చరిత్ర పుస్తకాల్లో చదువుకున్నామని, కానీ ప్రస్తుతం ధనికులతో సమానంగా జీవించడానికి సీఎం కేసిఆర్ దళిత బంధు పథకాన్ని అమలుచేసి, దళిత కుటుంబాల్లో సంతోషాన్ని నింపిన




ఘనత కేసిఆర్కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమేష్ నాయక్, పి ఎ సి ఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మహిళ అధ్యక్షురాలు రజిత, నాయకులు శ్యామ్ రెడ్డి, ఎడ్ల మహిపాల్, వెంకట్ స్వామి, రంగు రవి, ఎడ్ల రాజేష్, ఎడ్ల శ్రీను, నియోజకవర్గ నాయకులు వెంకట్ స్వామి, గ్రామ శాఖ అధ్యక్షులు యాకూబ్ పాషా, హరిబాబు, ఎడ్ల రమేష్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మార్వో విమల, గ్రామ పంచాయతీ సెక్రటరీ మరియు ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 19న కృష్ణస్వామి జయంతి వేడుకలు

**ముదిరాజ్ భవనంలో ఏర్పాట్లు**

**సికింద్రాబాద్ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** ముదిరాజ్ ల ఆరాధ్య దైవం, కుల సంఘాల ఆత్మ బంధువు కొర్వి కృష్ణస్వామి 129 వ జయంతి వేడుకలను ఈనెల 19 శుక్రవారం బోయిగూడలోని రాష్ట్ర కార్యాలయం ముదిరాజ్ భవనంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ముదిరాజ్ మహసభ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ముదిరాజ్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.... ముదిరాజ్ మహసభ వ్యవస్థాపకులు కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలను కూడ వైభవంగా నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఒకే రోజు ఇద్దరు లెజెండ్ ల జన్మదినోత్సవాలు రావడం గొప్ప విషయమన్నారు. జన్మదినోత్సవ వేడుకలకు రాష్ట్రంలోని ముదిరాజ్ సోదరులంతా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. మొట్టమొదటగా ముదిరాజ్ సంఘాన్ని స్థాపించిన గొప్ప సంస్కర్త , హైదరాబాద్ తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి కేవలం ఒక్క ముదిరాజ్ లకే కాకుండా అన్ని కుల బంధువులకు ఆదర్శంగా నిలిచారని వారు పేర్కొన్నారు. ఆ రోజుల్లో రజాకార్లకు ఎదురొడ్డి ఐక్యత కోసం కుల సంఘాలను ఏర్పాటు చేసిన గొప్ప నాయకుడు కొర్వి కృష్ణస్వామి అని అన్నారు. అలాగే కాసాని జ్ఞానేశ్వర్ లివింగ్ లెజెండ్ అని, రాష్ట్రంలో ముదిరాజుల ఐక్యత, వారి హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆదర్శ నాయకుడు అని అన్నారు. ముదిరాజులను వెంటనే బీసీ డీ నుంచి బీసీ ఏ కు మార్చాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 19 న జూబ్లీ బస్టాండ్ వద్ద కొత్తగా నిర్మించిన కొర్వి కృష్ణస్వామి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ముదిరాజులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజు మహాసభ



నాయకులు టి.సురేందర్, దొడ్ల సదానందం, నీలం శ్రీనివాస్, తలారి శ్రీకాంత్, మేకల శారద, బోయిని రాజేంద్రప్రసాద్, ఆంజనేయులు. పొట్లకాయల వెంకటేశ్వర్లు, సత్యం, మాలతి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం విజయవంతం

**జనగామ ఆగస్టు 17 (ప్రజామంటలు):** స్వతంత్ర భారత వజ్రోత్సవాల భాగంగా చేపట్టిన రక్తదాన శిబిర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జనగామ శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి పాల్గొన్నారు. స్టేషన్ ఘన్పూర్ లోని సామాజిక ఆరోగ్య వైద్యశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో పాటు జడ్పీ చైర్మన్ పా గాల సంపత్ రెడ్డి స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొని రక్తదాన శిబిర కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గంలో రక్తదాన శిబిరం నిర్వహణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ప్రతి నియోజకవర్గంలోనూ 75 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ తరుణంలో 75 యూనిట్ల రక్తాన్ని సేకరణ లక్ష్యంగా పెట్టుకొని మూడు నియోజకవర్గాలకు కలిపి 225 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు వైద్యాధికారులు డాక్టర్ సుగుణాకర్ రావు మహేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరానికి 300 మంది దాతలు తమ పేర్లను స్వచ్ఛందంగా నమోదు చేసుకున్నట్లు తెలియజేస్తూ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రక్తదాన శిబిర కార్యక్రమాన్ని



చేపట్టడం జరిగిందని తెలియజేస్తూ రక్తదానం చేయండి ప్రాణదానం చేయండి అంటూ వైద్యులు ప్రతి ఒక్కరికి తెలియజేశారు.

# మెరుగైన విద్య కొరకు చర్యలు చేపట్టాలి

- **ఖాళీగా ఉన్న 20 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి**
- **డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోహెడ చంద్రమౌళి డిమాండ్**

**జగిత్యాల ప్రతినిధి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** తెలంగాణ నూతన రాష్ట్ర%శీ%గా ఏర్పాటై ఎనిమిదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగం పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం మూలంగా నేడు ప్రభుత్వ విద్యారంగం సంక్షోభం వైపు పయనిస్తుందని ,రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే విద్యారంగ పటిష్టతకు చర్యలు చేపట్టాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా కమిటీ సమావేశం బుధవారం జగిత్యాల జిల్లా డిటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎన్నం రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి ఏ. నరేందర్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టి ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో విద్యారంగానికి13 శాతం నిధులు కేటాయిస్తే ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిధుల కేటాయింపు తగ్గిస్తూ నేడు 6.4 శాతానికి కేటాయింపులు పడిపోవడం వల్ల ప్రభుత్వ విద్య సంక్షోభంలోకి నెట్టివేయబడిందనీ దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. 317 జీవో వల్ల నష్ట పోయిన బాధితుల అప్పీళ్లను పరిష్కరించి న్యాయం చేయాలని, 13 జిల్లాలలో నిలిచిపోయిన భార్య భర్తల బదిలీల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నీలం సంపత్, జిల్లా కార్యదర్శి ముగిలి గంగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ డి. రవీందర్ రెడ్డి, వేణు కుమార్,




రాజేందర్, మల్లికార్జున్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

# బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరుపతి గౌడ్

**జగిత్యాల ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** తెలంగాణ బీసీ హక్కుల పోరాట సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్న జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన పొన్నం తిరుపతి గౌడ్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు బుర్ర కొండయ్య గౌడ్ నియమించారు. ఈమేరకు బుధవారం నియామకం చేసినట్లు కొండయ్య గౌడ్ ప్రకటించారు. ఈసంద



ర్భంగా తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.... అణగారిన వర్గాల హక్కుల సాధనే ధ్యేయంగా పని చేస్తానని, బీసీలకు రావాల్సిన హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని, బీసీ లందరూ ఐక్యంగా పోరాటం చేయాలని పొన్నం తిరుపతి గౌడ్ కోరారు. నాపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని నియామకం చేసిన రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రంలోనే ఆదాయంలో నెంబర్ వన్ "హుజూరాబాద్ ఆర్టీసి డిపో"

**హుజూరాబాద్ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కాసుల వర్షం కురిసిందని హుజురాబాద్ డిపో మేనేజర్ శ్రీమతి పి అర్పిత తెలిపారు. రాఖీ పండుగ



మరియు పాఠశాలలకు కళాశాలలకు సెలవులు రావడం వలన గత వారం రోజులలో హుజురాబాద్ డిపోకు 76.05 లక్షల ఆదాయం సమకూరినట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటన లో తెలిపారు. తేదీ 10 08.2022 రోజున 9.12 లక్షలు, తేదీ 11.08.2022 రోజున 10.52 లక్షలు, తేదీ 12.08.2022 రోజున 15.65 లక్షలు, తేది 13.08.2022 రోజున 10.15 లక్షలు, తేదీ 14.08.2022 రోజున 9.73 లక్షలు, తేదీ 15.08.2022 రోజున 10.93 లక్షలు మరియు తేది 16.08.2022 రోజున 9.95 లక్షల ఆదాయం హుజురాబాద్ డిపోకు సమకూరినట్లు డిపో మేనేజర్ తెలిపారు. హుజురాబాద్ డిపో ఎప్రిల్-2022 నుండి జులై-2022 వరకు 55 లక్షల నష్టాన్ని తగ్గించుకుని లాభాల బాటలో ప్రయాణిస్తుందని, ఈ సందర్భంగా హుజురాబాద్ డిపోకు అత్యధిక ఆదాయం తీసుకుని రావడానికి కృషి చేసిన ఉద్యోగులందరికి డిపో మేనేజర్ పి. అర్పిత పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ మేయర్ బండ కార్తీకా చంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

హాజరైన ఎంపీ డా. లక్ష్మణ్, పలువురు నాయకులు

**సికింద్రాబాద్ ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** హైదరాబాద్ మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీకా చంద్రారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం తార్నాక లోని ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు.




రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు కొంతం దీపిక, పద్మా వెంకటరెడ్డి, సునీత గౌడ్, సుచిత్ర తో పాటు పలువురు ప్రముఖులు కార్తీకా రెడ్డికి పుష్పగుచ్చాలను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే నాయకురాలు కార్తీకా రెడ్డి మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకొని ప్రజాసేవకు అంకితం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి, వీరన్న, ఓబీసీ నాయకులు శ్రీనివాస్, ఎస్టీ మోర్చ నాయకులు దిలీప్, ఎస్సీ మోర్చా నాయకులు రాజు, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, కొన్నే సంపత్, టెంపుల్ సాయి, తో పాటు సుమారు వంద లాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వేలాది మందికి అన్నదానం నిర్వహించారు.

# సర్వాయి పాపన్న జయంతి

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 17 (ప్రజామంటలు):** జగిత్యాలలో బహుజన నాయకుడు గోల్కొండ కోటను ఏలిన గౌడ బిడ్డ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం మొట్ట మొదటిసారిగా అధికారికంగా చేపట్టడం హర్షనీయమని సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రంగురామా గౌడ్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం గ్రామంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు చెట్ల చంద్రం గౌడ్ స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగిత్యాలలో జరిగే జయంతి వేడుకలకు జిల్లాలోని అన్ని గ్రామాల నుండి గీత కార్మిక సొసైటీల అధ్యక్ష కార్యదర్శులు, ఆయా గ్రామాల్లో జయంతి వేడుకలను బహుజన నాయకుల సమక్షంలో నిర్వహించుకుని, జిల్లా కేంద్రంలో జరిగే జయంతి వేడుకలకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చెట్ల చంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట నరస గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నాయిని శ్రీనివాస్ గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు గొల్లపల్లి రామా గౌడ్, మెట్పల్లి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం మండలాల అధ్యక్షులు ఏపూరి శ్రీనివాస్ గౌడ్, బండి మురళి గౌడ్, నేరెళ్ల సుభాష్ గౌడ్, మెట్పల్లి పట్టణ అధ్యక్షులు గుండ గాని విద్యాసాగర్ గౌడ్ బత్తిని మహేందర్ గౌడ్, నేరెళ్ల సంజీవ్ గౌడ్, కుంట ఆనంద్ గౌడ్, అబ్బూరి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com